తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## టిటిడి చైర్మన్ తో ఈఓ ముద్దాడ



తిరుమల, పిబ్రవరి 26ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి నూతన ఈఓగా నియమితులై బాధ్యతలు చేపట్టిన తరువాత మళ్ళీ గురువారం సాయంత్రం ఈఓ ముద్దాడ రవిచంద్ర తిరుమలకు వచ్చారు. ఈ సందర్భంగా టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. రేపు టిటిడి బోర్డు సమావేశంలో చర్చించనున్న అంశాలపై ఇద్దరూ చర్చించుకున్నారు.

# ప్రకృతి మాయాజాలం : వేరుశెనగ పంట మాయం

### పెట్టుబడుల భారం: కూలీల సమస్య అధికం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

తిరుపతి జిల్లాలోని తూర్పు నియోజకవర్గాలైన శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలు వ్యవసాయానికి పెట్టింది పేరు. రబీ సీజన్‌లో వరి, ముందస్తు ఖరీఫ్‌లో వాణిజ్యపంటగా వేరుశెనగ విస్తారంగా పండించే వారు ఒకప్పుడు. ఈ రెండు నియోజకవర్గాల్లోని ఐదు మండాలల్లో సుమారు 32వేల ఎకరాల్లో వరి, వేరుశెనగను పండించే వారు. ఈ ప్రాంతాల్లో ఓ వైపు రాజుల కాలం నాటి చెరువులు, మరో వైపు తెలుగు గంగ నీటితో సస్యశ్యామలంగా ఉంటున్నాయి. అయితే కొన్ని సంవత్సరాల క్రితం ఈ ప్రాంతాల్లో వాణిజ్యపంటగా 'వేరుశెనగను' విస్తారంగా పండించే వారు. వంగడాల కోసం మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకునే వారు. ఇక్కడి రైతులు పోలోమని ఇతర రాష్ట్రాల నుంచి తమకు అవసరమైన ఇక్కడివాతావరణానికి అనుకూలంగా తెగుళ్ళకు తట్టుకునే రకాలను కొనుగోలు చేసే వారు.

**అనుకూలించని వాతావరణం:**

వేరుశెనగ పంటను పండించాలంటే ఎంతో కష్టంతో కూడుకున్న పని. దానికి వాతావరణం అనుకూలించాలి. ఈ విత్తనాలు విత్తటానికి నవంబర్ నుంచి డిసెంబర్ 15వరకు అనుకూలం. అయితే గత కొంత కాలంగా ఈ ప్రాంతాల్లో ప్రకృతి అనుకూలించటం లేదు. సాధారణంగా విత్తనాలు విత్తిన తరువాత 20 రోజుల వరకు వర్షం కురుక కూడదు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా వర్షాలు సీజన్ ప్రకారం కురువటం లేదు. తుఫాన్లు కొంపముంచుతున్నాయి. సాధారణంగా ఈ ప్రాంతాల్లో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు వర్షాకాలం. అయితే ఇటీవల జనవరి, ఫిబ్రవరిలో sకూడా వర్షాలు కురుస్తున్నాయి. దాంతో వెరుశెనగ పంటపై రైతులు ఆశలు వదులుకున్నారు.

**నాణ్యమైన విత్తనాల కొరత:**

ఈప్రాంతాల్లో అన్నదాతలు పదేళ్ళ క్రితం వరకు జెఎల్ 20 విస్తారంగా వాడే వారు. ఈ రకం తెగుళ్ళను తట్టుకుంటుందని భావించే వారు. కానీ తరువాత ట్యాగ్ 24 కొంత కాలం పండించారు. ఆ పై కె 6 బాగా దిగుబడి వస్తుందని ఆ రకాలను ఎన్నుకున్నారు. అలాగే టిసిజిఎస్ 1706 రకాలను ఎన్నుకున్నారు. ఏ రకం ఎన్నుకున్నా ఇక్కడి వాతావరణం సహాకరించకపోవటంతో రైతులు పూర్తిగా మానుకున్నారు. ఒక నాడు 32వేల ఎకరాల్లో వాణిజ్య పంటగా పండించిన రైతులు నేడు కేవలం 1084 హెక్టార్లకే పరిమితమయ్యారు. ఈ ఏడాదికేవలం 732 హెక్టార్లలో(1832 ఎకరాలు) మాత్రమే వేరుశెనగ వేయటం గమనిస్తే ఆ పంట ఎంతగా కనుమరుగైందో అర్థమౌతుంది. ఇక ఒక నాడు ఈ పంట వేస్తే ఎకరాకు సుమారు 40 నుంచి 50 బస్తాల దిగుబడి వచ్చేది. కానీ నేడు ఆశ వదలుకోలేక పంటలను వేస్తున్న రైతులకు కేవలం ఎకరాకు 30 బస్తాలే దిగుబడి వస్తుందని వాపోతున్నారు. గతంలో విస్తారంగా పండించే శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు, కెవిబిపురం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల్లోని ఇసుక నేలలో పంట సాగు పూర్తిగా తగ్గింది.

**సమస్యలు జాస్తి: గిట్టుబాటు నాస్తి:**

వేరుశెనగ పంటలను పండించాలంటే అన్నదాతలకు సవాలక్ష సమస్యలు ఎదురౌతున్నాయి. ముఖ్యంగా ఈ పంటకు పెట్టుబడి అధికంగా కావాలి. కానీ కూలీల సమస్య వెంటాడుతుంది. తెగుళ్ల అధికం, పంట వేసినప్పటి నుంచి తవ్వాటాలకు మనుషులు కావాలి. ఒబ్బిడికి కూలీల అవసరం కానీ నేడు కూలీలు దొరకటం కష్టంగా మారింది. ఒక వేళ దొరికినా వారికి కూలి రేట్లు ఆకాశానంటాయి. దీంతో గతంలో ఎకరాకు రూ.10వేలు పెట్టుబడి పెడితే నేడు అది రెట్టిపు య్యింది. పంట రక్షణ ప్రశ్నార్థంగా మారింది. ముఖ్యంగా అడవి పందుల బెడద అధికంగా మారింది. అన్ని అధిగమించినా పంట చేతికొచ్చే సమయానికి గిట్టు బాటుధరల లభించటం లేదనే అసంతృప్తిచోటు చేసుకుంది. దాంతో ఈ ప్రాంతాల్లో రాబోయే రోజుల్లో 'వేరు శెనగపంట ' కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది.

అసెంబ్లీలో మన ఎమ్మెల్యేలు

## త్వరగా రైతులకు పాస్ పుస్తకాలివ్వాలి

### నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్



పుత్తూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త : భూముల రీ సర్వే త్వరితగతిన పూర్తి చేసి రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం అసెంబ్లీలో భూముల రీ సర్వే - పాస్ పుస్తకాల పంపిణీ పురోగతి అంశాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వేలో గత వైసిపి ప్రభుత్వ తప్పిదాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రీ సర్వేలో తప్పులతో పాటు, పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మను ముద్రించడం వల్ల రైతులు తమ భూముల విషయమై ఆందోళనకు గురయ్యారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారదర్శకంగా, జవాబుదారీతనంతో రీసర్వే నిర్వహించడం, రాజముద్రతో పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం ప్రారంభించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. భూముల రీ సర్వేలో ప్రజల అభ్యంతరాలను దృష్టిలో వుంచుకుని, సర్వేలో ఆలస్యం జరగకుండా త్వరగా పూర్తి చేసి రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాలని సూచించారు. దీనికి రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానమిస్తూ ఎమ్మెల్యే సూచనల మేరకు రీసర్వే, పాస్ పుస్తకాల పంపిణీ చేపడతామని తెలిపారు.

పారదర్శక పాలనతో

## శివయ్య ఆదాయాలను పెంచాం:

### శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిశాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం శాసనసభలో శ్రీకాళహస్తీశ్వరాలయంలో గత పాలకులు ఎలా దోచుకున్నారో? తాము ఎలా పారదర్శకతతో స్వామి ఆదాయాలను పెంచుతూ, జవాబుదారితనంతో వ్యవహారిస్తున్నామో వివరించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించిన యువతకు ఉద్యోగవకాశాల గురించి, పరిశ్రమలు కేటాయించే సిఆర్‌డి నిధుల గురించి చక్కగా ప్రస్తావించారు. గత వైకాపా పాలకులు శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని తమ అనుచరులకు ఆదాయ మార్గాలుగా అప్పగించారు. మనోళ్లే కదా అనుభవించని అంటూ దొరికినోళ్లకు దొరికినంత మహాదేవా అంటూ పంచుకున్నారని, అయితే తాము వచ్చిన 20 నెలల్లో పరిపాలనను చక్కబెట్టినట్లు వివరించారు. నాడు హుండ్లీ పడ్డ దబ్బులు స్వామి వారిది, బయట వచ్చేదంతా మనదన్నట్లు పంచుకున్నారని వివరించారు. నాటి పాలకుల విధానాల వల్ల ఆలయ ఆదాయంకేవలం రూ.80లక్షలకే పరిమతం అయ్యిందన్నారు. కానీ కూటమి అధికారం చేపట్టిన 20 నెలల్లోనే ఆ ఆదాయాలను రూ.3కోట్లుకు పెంచామన్నారు. ప్రసాదాల్లో త్రీ స్టేజ్ క్లియరెన్స్ తెచ్చి నాణ్యతను పెంచామని నాడు స్వామి వారి ముందు కుప్పిగంతలు వేసిన ఆరాచకానికి చెక్‌పెట్టి లక్షన్నర మంది భక్తులు శివరాత్రికి వచ్చినా ఎక్కడా చిన్న పొరబాటు జరగకుండా వచ్చిన ప్రతి ఒక్కరికి సుదర్శనం, సత్వర దర్శన భాగ్యం కల్పించామని సభ దృష్టికి తెచ్చారు.

## టిటిడి బకాయిలు విడుదల చేయించండి

### తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి విద్య, ఫిబ్రవరి 26 ప్రభాత వార్త

మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని టిటిడి ఆస్తులకు చెల్లించాల్సిన 132 కోట్ల రూపాయల ఆస్తి పన్నును వెంటనే విడుదల చేయించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. గురువారం ఉదయం అసెంబ్లీలో జీరో అవర్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతిలో 395 టిటిడికి చెందిన ఆస్తులు ఉన్నాయన్నారు. వీటిలో విద్య, వైద్య సంస్థలకు ఆస్తిపన్ను మినహాయింపుకు కౌన్సిల్ ఆమోదంతో పాటు ప్రభుత్వ అనుమతి ఉందని ఆయన చెప్పారు. అయితే శ్రీనివాసం, మాధవం, విష్ణు నివాసం అతిథి గృహాలతో పాటు మరో 28 ఆస్తులకు సంబంధించిన పన్ను బకాయిలు ఏళ్ళ తరబడి టిటిడి చెల్లించవడంతో వడ్డీతో కలిపి 132 కోట్లకు చేరిందని ఆయన తెలిపారు. కోర్టు కేసుల పేరుతో టిటిడి ఎప్పటికప్పుడు ఆస్తిపన్ను చెల్లింపుపై దాటి వేస్తుందని ఆయన చెప్పారు. టిటిడి మాత్రం తన అతిథి గృహాలు వినియోగించుకునే భక్తుల నుంచి జిఎస్టీ సైతం వసూళు చేస్తూ కార్పోరేషన్ కు ఆస్తి పన్ను కట్టడం లేదని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ నిరక్ష ్యం కారణంగా స్మార్ట్ సిటీ కింద చేపట్టిన సిటీ ఆపరేషన్స్ సెంటర్ బిల్డింగ్ (మున్సిపల్ పరిపాలనా భవనం) అసంపూర్తిగా మిగిలిఎ యిందని ఆయన చెప్పారు. కాంట్రాక్టర్ కు పెండింగ్ చెల్లించడంతోపాటు మిగిలిన పనుల పూర్తి తక్ష ణం డబ్బులు ఎంతో అవరసమని ఆయన కోరారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు కలుగచేసుకుని నిధులు లేక అవస్థలు పడుతున్న కార్పోరేషన్ కు టిటిడి బకాయిలు

సమర్థవంతంగా

## సంజీవని ప్రాజెక్ట్ అమలు

### - కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:

సంజీవని ప్రాజెక్ట్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పలమనేరు నియోజకవర్గ డాక్టర్లతో 4వ సమావేశం నిర్వహించి డిజిటల్ నర్స్ సెంటర్, సంజీవని ప్రాజెక్ట్ అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సంజీవని సెంటర్ ద్వారా ఓపి సేవలు, ఇంటి వద్ద నుండి నియామక సేవలు(హోమ్ అపాయింట్‌మెంట్ సర్వీసులు), రెఫరల్ సేవలు అందించబడుతాయన్నారు. ఈ సేవలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు ఈ సేవలను వినియోగించుకునేలా చూడాలన్నారు. అలాగే వైద్య సేవల నాణ్యత మెరుగుపరచడానికి 'టైమింగ్ ఫాలోఅప్' తప్పనిసరిగా చేయాలన్నారు. అలాగే పిసిసిను సమన్వయం చేసుకుని అన్ని లాగిన్లను విశ్లేషిస్తూ రెగ్యులర్ మానిటరింగ్ నిర్వహించాలని ఆదేశించారు. అలాగే రోగుల ఫాలోఅప్ కార్యక్రమంలో భాగంగా ప్రతి డాక్టర్ సరైన పూర్తి డేటాను అన్ని లాగిన్లలో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ డేటా భవిష్యత్తులో వ్యాధుల విశ్లేషణకు, ఆయా ప్రాంతాల్లో వ్యాధి తీవ్రత అంచనా వేయడానికి ఉపయోగపడుతుందన్నారు. అలాగే హాట్ స్పాట్స్ గుర్తింపులో సైతం ఈ డేటా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ డిటి సుధారాణి, డిప్యుటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్, డాక్టర్ ప్రవీణ, కో-అర్డినేటర్ డాక్టర్ ప్రసాద్, వివిధ పిహెచ్‌సిల డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## కొట్టాలం అడవికి మకాం మార్చిన ఏనుగులు

### - గాంధీపురం వద్ద రైతుల పంటలు ధ్వంసం



గాంధీపురం పరిసరాల్లో అరటి చెట్లను తొక్కివేసి నాశనం చేసిన ఏనుగులు

యాదమరి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:

ఐదు రోజులుగా భూమిరెడ్డిపల్లి నుంజర్ల ప్రాజెక్టులో జలకాలట ఆడిన ఏనుగులు బుధవారం అర్థరాత్రి తన మకాంను కొట్టాలం అడవిలోకి మార్చాయి. ప్రస్తుతం ఏనుగుల గుంపు తుమ్మిందపాళెం, కొట్టాలం మధ్య అడవి ప్రాంతంలో వున్నాయి. వీటిని మధ్య అడవుల్లోకి తరిమివేయడానికి అటవీశాఖ అధికారులు శాయశక్తుల ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇటీవల చిత్తూరు సంతపేట పరిసర ప్రాంతాల్లో వున్న రెండు ఏనుగులను అటవీశాఖ అధికారులు అడవుల్లోకి తీసుకెళ్ళి వదిలారు. ఆ రెండు ఏనుగులు అడవిలో మరో ఏనుగుతో కలిసి మూడు ఏనుగులు ఐదు రోజుల క్రితం భూమిరెడ్డిపల్లి నుంజర్ల ప్రాజెక్టుకు వచ్చి చేరాయి. అక్కడ ప్రాజెక్టులో రోజంతా మూడు ఏనుగులు వుండటంతో అటవీశాఖ అధికారులు ఆ ఏనుగులపై ఒక కన్ను పెట్టారు. ఈ క్రమంలో మూడు ఏనుగులు బుధవారం అర్థరాత్రి నుంజర్ల ప్రాజెక్టు నుండి బయటికి వచ్చి అటవీ మార్గం పట్టాయి. ఈ క్రమంలో నుంజర్ల ప్రాజెక్టు నుండి బయటికి వచ్చిన ఏనుగులు కాశిరాళ్ళ పంచాయతీ గాంధీపురం రైతు పంట పొలాల మీదుగా కొట్టాలం అడవుల్లోకి వెళ్ళాయి. ఈ క్రమంలో గాంధీపురం గ్రామానికి చెందిన పలువురు రైతుల పంటలను ఏనుగులు నాశనం చేశాయి. ఇద్దరు రైతుల టెంకాయ చెట్లను ఏనుగులు తీసివేయగా, అత్యధిక భాగం వరి పంటను తొక్కి ఏనుగులు నాశనం చేశాయి. తెల్లవారుజాము ఏనుగుల గుంపు పంట పొలాల గుండా వెళ్ళి వుండటంతో పొలాల్లోకి వెళ్ళిన రైతులు భయభ్రాంతులకు గురయ్యారు. విషయంను ఫారెస్ట్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. అయితే ఫారెస్ట్ అధికారుల దృష్టిలో ఈ ఏనుగుల సంచారం ఐదు రోజుల నుండి వుండటంతో ఏనుగులు ఎక్కడికి వెళ్ళాయనే విషయంపై ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. ఏనుగులు గాంధీపురం మీదుగా కొండల్లో వున్న అటవీ ప్రాంతం వైపు వెళ్ళి అక్కడి నుండి కొట్టాలం వైపు తరలివెళ్ళినట్లు గుర్తించి ఫారెస్ట్ అధికారులు ఏనుగులను వెంబడించారు. ప్రస్తుతం ఏనుగులు తుమ్మిందపాళ్యం-కొట్టాలం అటవీ ప్రాంతంలో వుంటున్నాయి. ఇక్కడి నుండి వీటిని సురక్షితంగా మధ్య అడవుల్లోకి తరలించడానికి అటవీశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు.

## సురుటుపల్లి పల్లికొండేశ్వర స్వామివారి సేవలో మంత్రి సతీమణి

*నాగలాపురం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:*

నాగలా పురం మండలం సురుటుపల్లి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి గురువారం ఉదయం 5 గంటలకు శ్రీగౌరీ సమేత శ్రీ దక్షిణామూర్తి స్వామివారికి విశేషంగా అభిషేకాలు జరగడం ఆనవాయితీ. అట్టి అభిషేకాలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత వారి మిత్ర బృందం స్వర్ణ గౌరీ సభ్యులు 22 మందితో



కలసి స్వామి అభిషేకంలో పాల్గొని అమ్మవారికి 11 గ్రాములు బంగారు తాళిబొట్టు వితరణ చేశారు. వీరికి ఆలయ చైర్మన్ పద్మనాభరాజు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి స్వామి, అమ్మవారి దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయఅర్చకులతో వేదమంత్రాలు నడుమ ఆశీర్వదించి బంగారు తాళిబొట్టును దేవస్థానానికి స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లాహిరి..లాహిరిలో...

### శ్రీరామచంద్రమూర్తి అలంకారంలో తెప్పపై విహారం



తిరుమల, పిబ్రవరి 26ప్రభాతవార్తప్రతినిధి:

ఫాల్గుణ మాసం దశమితిథి గురువారం రాత్రి తెప్పపై సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తి అలంకారంలో విభరించారు. సాయంత్రం ఆలయ మాఢవీధుల్లో ఊరేగుతూ పుష్కరిణి వద్దకు ఉత్సవమూర్తులు వేంచేశారు. ఇక్కడ మంగళవాయిద్యాల నడుమ ఉత్సవ మూర్తులను తెప్పపై కొలువుదీర్చారు. అర్చకులు కర్పూర హారతులిచ్చి తెప్పను కదిలించారు. పుష్కరిణి వద్ద భక్తులు, టిటిడి ఉద్యోగులు, గృహస్థభక్తులు గోవిందనామస్మరణలతో తెప్ప పుష్కరిణిలో కదిలింది. రాత్రి 7గంటలకు మొదలైన తెప్ప మూడుచుట్లు ప్రదక్షణ చేసింది. అన్న మయ్య ప్రాజెక్టు కళాకారులు సంకీర్తనలు ఆలపించగా భక్తులు స్వరం కలిపారు. పుష్కరిణి గోవిందనామాలతో పులకించింది. పెద్దజీయంగారు, చిన్నజీయంగారు, టిటిడి చైర్మన్ బిఆర్ నా యుడు, ఈఓ ముద్దాడ రవిచంద్ర, టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, సివిఎస్‌ఓ మురళీకృష్ణ, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పాల్గొన్నారు.

## నిర్వహణ లోపం-ఆదాయం భారం

### వృధాగా పెద్దసంఖ్యలో ఖాళీగా గదులు
### టిటిడి శ్రీదేవి కాంప్లెక్స్‌ను విస్మరించిన బోర్డు

ప్రభాతవార్త-తిరుపతి:

ప్రజాప్రయోజనాల కోసం ...వాణిజ్యసముదాయంగా తిరుపతి నగరం నడిబొడ్డున తిలక్‌రోడ్డులో టిటిడి నిర్మించిన శ్రీదేవికాంప్లెక్స్ భవనం నిర్వహణ లోపంతో అధ్వాన్నంగా తయారైంది. ఈ భవనం తొలిరోజుల్లో వ్యాపార కార్యకలాపాలపై కేంద్రంగా ఉండేది. ఈ కాంప్లెక్స్ నిర్మాణం సమయంలో టిటిడికి దుకాణాలు కేటాయించడం కూడా పెద్ద సమస్యగా తయారైంది. టిటిడికి భారీగా ఆదాయం సమకూర్చే విధంగా ఈ కాంప్లెక్స్ నిర్మాణం జరిగింది. గత నాలు గైదు సంవత్సరాలుగా ఈ కాంప్లెక్స్‌లో మొదటి, రెండవ ,మూడవ అంతస్థుల్లో పెద్ద పెద్ద గదులు అలాగే ఖాళీగా నిరుపయోగంగా ఉన్నాయి. తిరుమలలో మాస్టర్ ప్లాన్ అమలుచేసిన సమయంలో ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన స్థానిక నిరాశ్రయులకు తిరుపతిలో టిటిడి శ్రీదేవికాంప్లెక్స్ వాణిజ్యసముదాయం అప్పట్లోనే అధునాతనంగా నిర్మించింది. అన్ని సౌకర్యాలతో గ్రౌండ్‌ఫ్లోర్‌లో పూర్తిగా తిరుమల నిర్వాసితులకు రకరకాల వ్యాపార దుకాణాలకు కేటాయించారు. ఆ తరువాత మొదటి, రెండవ, మూడవ అంతస్థులు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు అనుగుణంగా విశాలమైన గదులు నిర్మించారు. ఈ కాంప్లెక్స్‌లో ప్రైవేట్‌సంస్థల కార్యాలయాలు, ప్రభుత్వరంగబ్యాంకు, ప్రభుత్వ కార్యాలయాలు, పర్యాటకవిభాగం కార్యాలయం, 108 అంబులెన్స్‌ల నిర్వహణ కార్యాలయం వంటి పలురకాలుగా ఉండేవి. అద్దెలు కూడా ఆయా గదుల విస్తీర్ణం బట్టి నిర్ణయించి కేటాయించారు. ప్రతినెలా లక్షలాదిరూపాయలు అద్దెల రూపంలోనే టిటిడి ఖజానాకు చేరేది. పదిసంవత్సరాల క్రిందట టిటిడి జిఎస్‌టి పెరగడంతో ఈ కాంప్లెక్స్‌లోని పలు కార్యాలయాల అద్దెలు భారీగా పెంచేశారు. దీంతో చాలావరకు దుకాణాదారులపై భారం పడటంతో అద్దెలు కూడా చెల్లించలేదనేది సమాచారం. ఇప్పుడు ఈ ప్రాంగణం మొత్తంలో ఖాళీగా అనేక గదులు ఉండటం, వాటి నిర్వహణ లోపంతో కిటికీలు, తలుపులు దెబ్బతిన్నాయి. గోడలు కూడా చాలావరకు బీటలు వారాయి. గత మూడేళ్ళుగా పూర్తిగా శ్రీదేవి కాంప్లెక్స్ నిర్వహణ లేకపోవడంతో ఎక్కడివక్కడ దెబ్బతిన్నాయి. గత రెండేళ్ళుగా టిటిడి బోర్డు కూడా దీన్ని గురించి, దీని ఆదాయం గురించి పూర్తిగా



పట్టించుకోకపోయింది. ఇప్పటికైనా ఎంతో ప్రాముఖ్యత ఉన్న నగరం నడిబొడ్డున వాణిజ్యకార్యకలాపాల కేంద్రం శ్రీదేవికాంప్లెక్స్ గదులను మరమ్మతులుచేసి ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు వ్యాపారులు కోరుతున్నారు.

## విద్యార్థులు చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలి

గుడుపల్లె, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త




విద్యార్థులు చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలని రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ సూచించారు. గురువారం కొడతనపల్లి జడ్పీ హైస్కూల్‌లో వార్షికోత్సవం సందర్భంగా ఆయన విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు విద్యపై మక్కువ చూపాలన్నారు. అలాగే క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు సెల్‌ఫోన్లను మితంగావాడితే ఎంతో మంచిదని సూచించారు. నైతిక విలువలపై అవగాహన పెంచుకోవడం పాటు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

బైరెడ్డిపల్లి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త



పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని ఎంఇఒ సూచించారు. స్థానిక జడ్పీ బాలికల హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థినులకు హెచ్ఎం దేశమ్మ అధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయా లకు అనుగుణంగా విద్యార్థినులు పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని సూచించారు. అనంతరం విద్యార్థినులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఏక్షణాన కూలుతుందో సారూ !!



బైరెడ్డిపల్లి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

మండలంలోని పాతూరు నత్తం పంచాయతీ మిట్టకురప్పల్లి గ్రామంలో నీటి ట్యాంకు శిథిలదశకు చేరి ఏక్షణాన కూలుతుందోనని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకు నెర్రలు చీలడంతో పాటు నీరు కారుతూ ట్యాంకు పాచి కట్టిందని పేర్కొన్నారు. శిథిల దశకు చేరిన ట్యాంకు స్థానంలో నూతన ట్యాంకును నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## గణనాధుని సేవలో నీటిపారుదల శాఖ అభివృద్ధి సంస్థ ఛైర్మన్

కాణిపాకం,ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:



రాష్ట్ర నీటి పారుదల శాఖ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ లీలా కృష్ణ శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు.అనంతరం శ్రీవీరాంజనేయస్వామిఆలయం, నవగ్రహ ఆలయం లలో కూడా పూజలు నిర్వహించారు.వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు ఈకార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు శివప్రసాద్, సూపరెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

## రూపానందరెడ్డిచే సీఎంఆర్ఎఫ్ పంపిణీ

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

మండలంలోని దాదాపు 10 గ్రామాలు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధిని టిడిపి ఇంచార్జ్ రూపానందరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో ఉన్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అన్ని విధాలా చేదోడు వాదోడుగా ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఐదు మండలాలలో ప్రమాద బాధితులు మరియు అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక గొప్ప వరమని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ వై జై ప్రకాష్, పఠాన్ మోల, పోకల మనీ, ముంతాజ్ మెహతాజ్ బేగం, తల్లెం రమణారెడ్డి, గడికోట సుబ్బరాయుడు, శివరెడ్డి, శివ, సుదర్శన్‌రాజు, ఆకేపాటిసుకుమార్‌రెడ్డి తో పాటు కూటమికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వృత్తివిద్య క్షేత్రస్థాయి పర్యటన.




చిట్వేలి ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వృత్తి విద్యలో అవగాహన పెంపొందించుటకు 6 నుండి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు విద్యా పర్యటన నిర్వహించబడింది. ఈ సందర్భంగా పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిట్వేల్ విద్యార్థులు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఆఫ్ వనంను మరియు అన్నమాచార్య ఇంజనీరింగ్ కాలేజ్ లను క్షేత్రస్థాయిలో సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.దుర్గరాజు మాట్లాడుతూ, విద్యార్థులు పాఠ్యపుస్తకాల జ్ఞానంతో పాటు వృత్తి విద్యపై కూడా అవగాహన పెంపొందించుకోవడం అవసరమని సూచించారు. వివిధ వృత్తులకు అవసరమైన నైపుణ్యాలు ఏవి, అవి ఎలా ఉపయోగపడతాయి, వాటిని నేర్చుకోవడం వల్ల భవిష్యత్తులో ఏ అవకాశాలు ఉంటాయి అన్నది తెలుస్తుందని అన్నారు..వృత్తి విద్య ఉపాధ్యాయులు జి.చిన్న బాబు, షేక్ రఫీ, నాగమణి మరియు గణిత టీచర్ గీతారాణి పాల్గొన్నారు.

## మొరాయించిన ఆర్టీసీ బస్సు.. ఇంటర్ విద్యార్థుల పరుగులు

కుప్పం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

కుప్పం – అలుగుమానిపల్లి మార్గంలో తిరిగే ఆర్టీసీ బస్సు గురువారం ఉదయం నడిరోడ్డులో మొరాయించింది. అలుగుమానిపల్లి నుంచి బయల్దేరిన బస్సు ఓ దఫా మొరాయించగా అందరూ కలసి తలోచేయి వేసి తోయడంతో బస్సు ముందుకు కదిలినట్లు విద్యార్థులు చెప్పారు. మార్గమధ్యంలో మల్దేపల్లి వద్ద మరోమారు మొరాయించి ఆగిపోయింది. దీంతో ఆ బస్సులో వస్తున్న ఇంటర్ విద్యార్థులు పలువురు ఆ మార్గంలో కుప్పం వైపు వస్తున్న టువీలర్ల వారిని లిఫ్ట్ అడిగి బ్రతుకు జీవుడా అంటూ పరీక్షా కేంద్రాలకు పరుగులు తీశారు.

## రైతులు పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

– మాజీ ఎమ్మెల్సీ గౌనివారి



శాంతిపురం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కోరారు. గురువారం మండల కార్యాలయంలో ఉద్యానవన శాఖచే రైతులకు అరటి, బొప్పాయి పంటలో సస్యరక్షణ చర్యలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. శా స్త్రవేత్త డా॥ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో అరటిసాగులో పనామా తెగులు, సిగబోక ఆకుమచ్చ తెగులు ఆశిస్తుందన్నారు. దీని నివారణకు రైతులు టిష్యూకల్చర్ మొక్కలు నాటాలని సూచించారు. జీవన ఎరువుల వాడకం, నీటి యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. పంటలసాగుకు లభించే రాయితీల గురించి ఎడి పల్లవి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి రామాంజనేయులు, ఉదా ్యనవన అధికారులు వింధ్య, డింపుప్రియ, ఎఎంసి డైరెక్టర్లు చంద్రకళ, హరినాథ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## స్కూల్ వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

వి.కోట, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త



వి.కోట – కుప్పం జాతీయ రహదారిలో జంగం గురవేపల్లి క్రాస్ వద్ద ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు టువీలర్‌ను ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. వి.కోట పట్టణం నుంచి స్కూల్ బస్సు విద్యార్థులతో జంగం గురవేపల్లికి బయల్దేరి విద్యార్థులను దింపేసి తిరిగి వస్తూ మార్గమధ్యంలో టు వీలర్‌లో వెళ్తున్న గుడుపల్లె మండలం నలగాంపల్లికి చెందిన వినాయక (52) అనే వ్యక్తిని ఢీకొంది. దీంతో అతని తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

## టమోటా బాక్సుల చోరీపై సిఐకు ఫిర్యాదు



వి.కోట, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

స్థానిక మార్కెట్ యార్డులో రాత్రిపూట టమోటా బాక్సులను దొంగిలించి గుజరీ వ్యాపారులకు విక్రయిస్తున్నాకంటూ మండీల యజమానులు సిఐ సోమశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. వి.కోట సమీపంలో పొంతనపల్లి వద్ద ఓ గుజరీ వ్యాపారి షెడ్డులో సుమారు ఐదువ ందల టమోటా బాక్సు లు ఉ ండడం గమనించి అతన్ని నిలదీయడంతో రోజుకు ఎంతోమంది వస్తుంటారు ఐదునుంచి పది బాక్సు లు తెచ్చి విక్రయిస్తారని తెలిపాడన్నారు. ఈ విషయంగా తగు చర్యలు తీసుకోవాలని సిఐను కోరారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

రామకుప్పం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త




విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలు అధిరోహించాలని టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ సూచించారు. కెంపసము ద్రంలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావే శంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యా ర్థులు పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు గంట్లరెడ్డి, సుబ్రి, అల్లిశీన, సాగర్‌రెడ్డి, ఉపాధా ్యయులు అన్సర్, నరేంద్ర, రాజేంద్రప్రసాద్, దిలీప్‌కుమార్, మహబూబ్ జాన్, లత, రంగనాథ్, అ ంజప్ప పాల్గొన్నారు.

## క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ




రామకుప్పం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నిర్వహించిన క్విజ్ పోటీల్లో తని గానూరు జడ్పీహైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి నగదు బహుమతి అందుకున్నట్లు హెచ్ఎం ఆదిశేషయ్య తెలిపారు. మండలంలోని 45పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన గా కార్తీక్, సోమేశ్వర్, పూజశ్రీ ప్రథమ స్థానం సాధించి పదివేల నగదు బహుమతి పొందారన్నారు. విద్యార్థులను ఎంపిపి సులోచన గుర్రప్ప, మాజీ సర్పంచ్ రామూర్తి,

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మోకాళ్ళతో నిలబడి అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన

చిత్తూరు, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:



తమ న్యాయపరమైన సమస్యలను సత్వరం పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత నాలుగు రోజులుగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు గురువారం మోకాళ్ళపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు రోజుల క్రితం నుండి రిలే నిరాహారదీక్షలు జరుగుతున్నప్పటికీ ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వంలో చలనం లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ నెల 27వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నాకు జిల్లా వ్యాప్తంగా వున్న అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ నాయకులు ప్రేమ, ప్రభావతి, ఎం.బుజ్జి, సుజిని, ఏఐటియుసి నాయకులు కె.మణి, పి.రఘు, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

## గుంతలమయమైన సర్వీస్ రోడ్డు -పట్టించుకోని అధికారులు

– 3 నెలలుగా వాహనదారుల ఇబ్బందులు – గుంతలలో దిగినోళ్లు ఆసుపత్రి పాలే

పూతలపట్టు, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త



బెంగళూరు నాయుడుపేట జాతీయ రహదా రిలోపి కొత్త కోట గ్రామపంచాయతీ పరిధి లోని శ్రీపురం గ్రామం వద్ద సర్వీస్ రోడ్డు గుంతలమయమైంది. గత మూడు నెలలుగా సర్వీస్ రోడ్డు నందు వాహన దారులు గుంతల వలన అనేక ఇబ్బందులు ఫాలో అవుతు న్నారు. పలు ప్రమాదాలు జరిగినట్టు స్థానికు లు తెలిపారు. అధికారులకు పలుమార్లు తెలియ జేసిన ఏమాత్రం పట్టించుకోవడం లేదు అధికారులు నిర్లక్ష్యం కారణంగా వాహనాలు గుంతలలో దిగడం వలన అదుపుతప్పి ప్రమాదాలు జరిగి చిత్తూరు, తిరుపతి వంటి ప్రదేశాలకు హాస్పటల్ కు వెళ్తున్నారు. సర్వీస్ రోడ్డు పక్కన సైడ్ గోడ నిర్మించకపోవడంతో గ్రామంలో డ్రైనేజీ నీరు రోడ్డు పై రావడంతో మరింత పెద్దవిగా గుంతలు ఏర్పడుతున్నాయి. దీనికి సంబంధించిన అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

## ఆదర్శ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

యర్రావారిపాలెం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:

మండలంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరళ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2026 – 27 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వం 6వ తరగతిలో చేరే విద్యార్థులకు ఏప్రిల్ 12 వ తారీఖున ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఐదో తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో పరీక్ష ఉంటుందన్నారు. ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 01.09.2014 నుండి 31.06.2026, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01.09 .2012 నుండి 31.06.2016 మధ్య పుట్టిన వారై ఉండాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో గత రెండు విద్యా సంవత్సరాల్లో ఒక ఏడాది చదివి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు మార్చి 31 వ తేదీ లోపల ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకొని పత్రాలను ఆదర్శ పాఠశాలలో చేర్చాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ. 200, ఎస్సీ, ఎస్టీలకు రూ.125 పరీక్షా ఫీజును ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆరవ తరగతి ప్రవేశంపై కనీస మార్కులు ఓసీ, బీసీ విద్యార్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు రావాలన్నారు. వివరాల కొరకు ఆదర్శ పాఠశాలను సంప్రదించాలని సూచించారు. కావున ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## బాల్యవివాహాలు లేని సమాజానికి కృషి

పులిచెర్ల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త



పులిచెర్ల ఐసిడిఎస్ పరిధిలోని కావేటిగారిపల్లి జడ్పిహెచ్ స్కూల్‌లో సిడిపిఓ వాణి శ్రీ దేవి ఆదేశాల మేరకు బాల్య వివాహాలు లేని సమాజానికి కృషి కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. బాల్య వివాహాలను అరికట్టుటపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి బాల్య వివాహాలు లేని సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత వివాహం చేయాలని తెలిపారు. బాల్యంలో వివాహం ఎవరైనా చేసిన చేపించిన వారికి శిక్ష తప్పదన్నారు. బాల్య వివాహం ఒక సాంఘిక దురాచారమని అన్నారు. బాల్య వివాహాలు ఎక్కడైనా నిర్వహిస్తే 1098 నెంబర్‌కు కాల్ చేస్తే వెంటనే అధికారులు బాల్య వివాహాలను నిలుపుదల చేస్తారన్నారు. బాల్య వివాహం చేసుకుంటే జరిగే ఆరోగ్య అనర్థాలు గురించి బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం లోకనాథం మాట్లాడుతూ కిశోర బాలికలో జరిగే శరీర మార్పుల వల్ల వారికి జరిగే ఇబ్బందికర పరిస్థితులు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయచంద్రనాయుడు, శ్రీనివాసులు, మధుసూధన్ రెడ్డి, విద్యాసాగర్, అస్రఫ్ సాహెబ్, ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడి కార్యకర్తలు ఉమారాణి, ప్రభావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## కుప్పంలో జనసేన సభ్యత్వ నమోదు ఘనంగా ప్రారంభం

కుప్పం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త



జనసేన పార్టీ అధిష్టానం పిలుపు మేరకు కుప్పంలో గురువారం జనసేన సభ్యత్వ నమోదు ఉద్యమి కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్, కాణిపాకం డైరెక్టర్ నరేష్ అధ్వర్యంలో స్థానిక శ్రీ తిరుపతి గ ంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం కార్యక్రమంను లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా నరేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు వంద మంది సాధకులు సమన్వయంతో పనిచేసి ప్రతి ఇంటికీ జనసేన సిద్ధాంతాలు, అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు తీసుకెళ్లాలని సూచించారు. సభ్యత్వ నమోదుతో కార్యకర్తనుంచి నాయకత్వ స్థాయికి ఎదిగేందుకు మంచి వేదిక ఉ ంటుందన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్షులు అమీర్, హరీష్, కిషోర్, బాలు, నేతలు పవన్‌కుమార్, పవన్ మహేష్, అంజప్ప, నవనీత, హేమావతి, దివ్యభారతి, కుసుమ, నరసమ్మ, రఘు, భాస్కర్, మంజునాథ్‌శెట్టి, సురేష్, హంసగిరి, గణేష్, నవీన్, బాబు పాల్గొన్నారు.

# రైల్వే కోడూరు డివిజన్

## మంచి ఫలితాలతో ఉన్న స్థాయికి ఎదగాలి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త




పదవ తరగతి పరీక్ష ఫలితాలతో విద్యార్థులు ఉన్న స్థాయికి ఎదగాలని హెచ్ ఎం ఎం హైస్కూల్ హెడ్మాస్టర్ పుట్టా ప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని హెచ్ఎంఎం హైస్కూల్‌లో ఫేర్వెల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ మాట్లాడుతూ పదవ తరగతి రాస్తున్న విద్యార్థిని విద్యార్థులు చక్కటి ఫలితాలతో ఉన్నత స్థాయికి చేరాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు ఉమ్మడి రాష్ట్రంలో నే కాకుండా విదేశాలలో కూడా ఉన్నత స్థాయి ఉద్యోగాలలో పనిచేస్తున్నారని ప్రతి ఒక్క పరీక్ష రాసే విద్యార్థి పై స్థాయిలో చేరాలని ఉద్దేశంతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ప్రసాద్ విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధా రాణి, కృష్ణ, హరి, చందు, శ్రీదేవి, నవీన్, జగదీష్, ఆశాలత, విజయలక్ష్మి, శివ, కళ్యాణ్, చిన్ను తో పాటు విద్యార్థులు పాల్గొని పలు సాంస్క ృతిక కార్యక్రమాలలో ప్రతిభను కనబరిచారు.

## యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై సమీక్ష

చిట్వేలి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:



పంచాయతీలలో నిర్వహిస్తున్న వివిధ సర్వేలపై గురువారం తిరుపతి జిల్లా స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు అధికారి జీవి నారాయణరెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, అక్షరాంధ్ర, ఈకేవైసీ మరియు ఇంటి పన్నులు వసూళ్లు మొదలగు అంశాలను చర్చించి వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గడువు లోపల తమకు కేటాయించిన పనిని పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శులు మరియు స్వర్ణ గ్రామ సిబ్బంది ఇంటి పన్నులు గడువు లోపల ఆన్లైన్ విధానంతో బాధితులే చెల్లించే విధంగా చూడాలన్నారు. నగదు స్వీకరించరాదని తెలిపారు. ఆన్లైన్ ద్వారా లేదా ఫోన్పే ద్వారా ఇంటి పన్ను చెల్లించిన వారికి రసీదు కూడా ఆన్లైన్ ద్వారానే పొందవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి కె శ్రీనివాసులు, మండల స్వర్ణ గ్రామ అధికారి ఎం అనిల్ కుమార్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏకతాటిపై నిలుద్దాం.. డిమాండ్లను సాధించుకుందాం



చిట్వేలి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:

ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న మహిళలు హక్కులతో కూడిన తమ డిమాండ్లను సాధించ డానికి ఏకం కావాలని రాష్ట్ర గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రైల్వేకోడూరు నియోజకవర్గ అధ్యక్షులు ఇస్మాయిల్ భాష అన్నారు. మార్చి 8 మహిళా దినోత్సవం సంతరించుకుని మహిళా శ్రేయస్సే సమాజ పురోగతి అని, మహిళా సాధికారతే అభివృద్ధికి అసలైన పునాది అన్న నినాదంతో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె. సూర్యనారాయణ పిలుపు మేరకు మార్చి 7వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న భారీ సదస్సుకు సంబంధించిన గోడపత్రికను గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో తాను ఆవిష్కరించారు. ఉద్యోగ విధులలో మహిళల పాత్ర విలువైనదని, పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇస్మాయిల్ భాష కోరారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో పనిచేస్తున్న మహిళా వైద్యులు, సిబ్బందికి అధికారిక ఆహ్వాన పత్రాలను అందజేశారు. మహిళా సాధికారత నినాదాలతో జరగనున్న ఈ సదస్సు ఉద్యోగినుల్లో నూతన ఉత్తేజాన్ని నింపుతుందని అసోసియేషన్ ప్రతినిధులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సల్మా, మహిళా ఉద్యోగస్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు చిట్వేలి విద్యార్థులు

చిట్వేలి, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:




సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న రాష్ట్ర స్థాయి సైన్స్ సమగ్ర శిక్ష మహోత్సవ పోటీలకు పి.ఎం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిట్వేల్ విద్యార్థులు ఎంపిక య్యారని ప్రధానోపాధ్యా యులు బి.దుర్గరాజు తెలిపారు. గురువారం తాను మాట్లాడుతూ వివిధ విభాగాల కింద విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ఈనెల 23వ తేదీన ఆన్లైన్ విధానం ద్వారా సమర్పించగా, అందులో పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు ఎ.శివన్నారాయణ గౌడ్ మార్గదర్శకత్వంలో ఏ.సుస్మిత వి.దివ్యశ్రీ మరియు ఆర్. కుషాల్ రూపొందించిన రాకెట్ మోడల్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం జరిగిందన్నారు. సైన్స్ సమగ్ర మహోత్సవం పోటీల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్కోణం అభివృద్ధి చెందడం, రోజువారీ జీవితంలో శాస్త్రాన్ని ఎలా ఉపయోగించాలో అవగాహన పెరుగుతుందని, అనుభవాత్మక అభ్యసనను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులలో స్వయంకృషి, పరిశోధనాత్మక దృక్కోణం అభివృద్ధి చెందుతుందని దుర్గరాజు అన్నారు. అలాగే ప్రతిష్టాత్మకమైన ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్ మరియు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ కవర్ పేజీ నందు ఆన్లైన్ ద్వారా విద్యార్థులు సమర్పించిన ప్రాజెక్టు ఫోటోలకు స్థానం దక్కడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, సోఫియా, కళావతి, సుహాసిని, సునీత కుమారి మొదలగు ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మాలతీచందూర్ రచనలు ఆలోచనాత్మకం

– ద్రవిడ వర్సిటీ వి.సి. ఆచార్య ఎం.దొరస్వామి

కుప్పం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త




ప్రముఖ రచయిత మాలతీ చందూర్ రచనలు ఆలోచింపజేసే రీతిలో ఉంటాయని ద్రవిడ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎం.దొరస్వామి పేర్కొన్నారు. గురువారం ద్రవిడ వర్సిటీలో మాలతీచందూర్ ఎండోమెంట్ లెక్చర్ సిరీస్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. విసి మాట్లాడుతూ 19వ శతాబ్దం చివరలో కందుకూరి వీరేశలింగంపంతులు వంటి సంస్కర్తలు సామాజిక అంశాలపై రచనలు చేసి కథా ప్రక్రియకు నూతన దిశ చూపారన్నారు. కుటుంబ వ్యవస్థ, మహిళా విద్య, సామాజిక సంస్కరణలు కథల్లో ప్రధానాంశాలుగా మారాయన్నారు. అలాగే మాలతీ చ ందూర్ రచనలు సైతం మహిళల భావ జాలాలకు అద్దం పట్టేలా కొనసాగాయన్నారు. కాలికట్ వర్సిటీ ఆచార్య శ్రీకళా ముల్లస్సెరి స్త్రీవాదంలో ఉన్న వివిధ రకాల దృక్కోణాలు వివరించారు. కర్ణాటక వర్సిటీ మాజీ విసి డా॥ మల్లెకగంటి కన్నడ సాహిత్యంలో స్త్రీల సమస్యలపై విశ్లేషణ చేశారు. ప్రముఖ స్త్రీవాద రచయిత్రి డా॥ మల్లేశ్వరి తెలుగు కథల్లో స్త్రీల సమస్యలు స్పృశిస్తూ వెలువడిన కథల గురించి వివరించారు. కార్యక్రమంలో డా॥ శ్యామల, డా॥ పళని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మత్తుపదార్థాల జోలికి వెళితే జీవితాలు బుగ్గిపాలే

కుప్పం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త



విద్యార్థులు మత్తు పదార్ధాల జోలికి వెళితే జీవితాలు బుగ్గిపాలు అవుతాయని ఎస్పై రామకృష్ణ సూచించారు. గురువారం పొన్నాంగూరు హైస్కూల్‌లో హెచ్ఎం భారతి అధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ వైపు అడుగులు వేస్తే జీవితాలు చీకటిమయం కావడంతో పాటు ఆరోగ్యం నాశనం అవుతుందన్నారు. చట్టపరమైన కఠిన చర్యలు కూడా తప్పవని హెచ్చరించారు. తప్పుడు నిర్ణయాలు భవిష్యత్తును శాశ్వతంగా దెబ్బతీస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## జీవన నైపుణ్యాలపై బాలలకు అవగాహన



**శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 26 ప్రభాతవార్త** బాలలకు జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించుటకు శ్రీకాళహస్తి మండలం పాపన పల్లి గ్రామంలో ప్రగతి స్వచ్ఛంద సారధ్యంలో లలైఫ్ స్కిల్స్ మాడ్యుల్స్ ద్వారా కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భం గా కోఆర్డినేటర్ నారాయణ మాట్లాడుతూ బాల్యదశలోనే జీవన నైపుణ్యాలను పెంపొందించుటకు స్వీయ గుర్తింపు సమూహా గుర్తిం పు విభిన్న రకాల అలోచనలలతోని తేడాలను ఇతరుల కంటే భిన్నంగా ఆలోచించటం ఎంతో ముఖ్యమన్నారు. కాలానుగుణంగా నైపుణ్యా లను మెరుగుపరచుకోవటం జీవితంలో ఎదురయ్యే బాల్యదశ నుంచి ఎలాంటి ఒడుదుడుకకులు ఎదుర్కొని నైపుణ్యాలను పెంపొందించుకోవటం ఎంతో ముఖ్యమని బోధించారు. స్వీయ గుర్తింపులో వ్యక్తులవయస్సు లింగంవిదాయ సామర్థ్యం వైకల్యం ప్రతిభ పిల్లల అభివృద్ధివివిధ దశల్లో జరుగు తుందని వివరించారు.శ్రీకాళహస్తి మండల కన్వీనర్ చంద్రశేఖర్, శిరీష(ఏర్పేడు) జయలక్ష్మీ(రేణిగుంట)సిబ్బంది రామచంద్ర,మురుగయ్య, వెంకటేశు, సురేస్,సుభాష్‌చంద్రబోస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణి

**శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి మండలంలోని పలు గ్రామాల్లో ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి మంజూరు అయిన చెక్కులను గురువారం స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ బాధితు లకు అందించారు. వివిధ కారణాలతో ఆనారోగ్యం పాలైన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు అయిన సహాయాన్ని ఆమె ఇళ్ళకు వెళ్ళి వరిని పరామర్శించి అందించారు. 13 మంది బాధితులకు రూ.14,04,880లను అందించారు. ఈ కార్యక్రమాల్లో ఆమెతోపాటు మండల నాయకులు, సీనియర్‌నాయకులు చెలికం పాపిరెడ్డి, జడ్‌పిటిసి వెంకటసుబ్బారెడ్డి, కామేష్‌యాదవ్, జగదీశ్వరరెడ్డి, రేవిళ్ళ రమేష్, సుబ్రమణ్యం నాయుడు, చరణ్, రఘునాయుడు, బత్తయ్య, దొరైరాజ్‌రెడ్డి, ఎం.మనో హర్‌గౌడ్, రవీంద్ర, కుమారి,నాగేశ్వర్‌రెడ్డి, హరిబాబు,అంకయ్య, పవన్, రాము,,శ్రీను పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆధ్వర్యంలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ విజయవంతం



***తిరుపతి విద్య ఫిబ్రవరి 26 ప్రభాత వార్త*** స్థానిక న్యూ బాలాజీ కాలనీ లో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన"స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్" కార్యక్రమం ఘనంగా జరిగింది. పాఠశాల డి జి ఎం కొండల రావు,ఏ జి ఎం శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యార్థులు తమ విద్యా ప్రగతిని, ప్రాజెక్టులను,సృజనాత్మక కార్యక్రమాలను తల్లిదం డ్రుల ముందుంచారు.ఈ కార్యక్రమంలో 1వ తరగతి నుండి 2వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొని సైన్స్, గణితం, సామాజిక శాస్త్రం, భాషా విషయాలలో రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ముఖ్యంగా సైన్స్ విభాగంలో విద్యార్థులు రూపొందించిన పర్యావరణ పరిరక్షణ నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ వసంత్ ,ప్రిన్సిపాల్ షాహిద్ భాషా , జోనల్ కోఆర్డినేటర్ గాయత్రి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నవిజయవంతంగా ముగిసింది.

## ఇంగ్లీష్ పేపర్2కు 454మంది గైర్హాజరు.

**తిరుపతి విద్య, ఫిబ్రవరి 26 ప్రభాత వార్త**

ఇంటర్మీడియట్ పరీక్షలలో భాగంగా గురువారం జరిగిన ఇంగ్లీష్ లాంగ్వేజ్ పేపర్2 పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఆర్ఓ జి రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్,ఒకేషనల్ గ్రూప్లకు సంబంధించి 454 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, జిల్లా వ్యాప్తంగా జనరల్ విద్యార్థులకు 84 పరీక్షా కేంద్రాలలో జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు 28,395 మందికి గాను 27,968 మంది హాజరయ్యారని తెలిపారు. అలాగే ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు 14 సెంటర్లో జరిగిన పరీక్షకు మొత్తం 1,075 మంది గాను 1,048 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని తెలియజేశారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్లతో నిరంతర పర్యవేక్షణ చెపట్టామని, పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

## సరైన మార్గదర్శకత్వంతోనే సివిల్స్ సాధ్యం: డా. పి.వి.లక్ష్మయ్య



**తిరుపతి విద్య, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త** విద్యార్థులు సివిల్ సర్వీసెస్‌కు సిద్ధం కావాలనే ఉత్సాహంతో అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ పి. జగపతి రామయ్య ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర స్టేట్ వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ సివిల్ సర్వీసెస్ అభ్యర్థుల మార్గదర్శ కులు డా. పి. వి. లక్ష్మయ్య ప్రధాన వక్తగా పాల్గొన్నారు. డా. లక్ష్మయ్య మూడు గంటలపాటు ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించి, సివిల్ సర్వీసెస్ పరీక్షలతో పాటు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్-I, గ్రూప్-II పరీక్షలపై సమగ్ర అవగాహన కల్పించారు. అభ్యర్థులు, తల్లిదండ్రులు అడిగిన అనేక ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ జె. వి. రమణ విచ్చేసి, యువతను ప్రజా సేవ వైపు దారితీసే ఈ కార్యక్రమాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో డా. గీత,డా. స్వామి బాబు,రవి కుమార్, రమేష్, చెరుకూరి సతీష్, వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలేపార్టీకి పునాదులు : వారి బాగోగులు మా బాధ్యత



**తొట్టంబేడు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీకి పెట్టని కోట గోడలు కార్యకర్తలని వారిని ఆదుకోవటం పార్టీ బాధ్యత అని రాష్ట్ర పార్టీ కార్యదర్శి గాలి చలపతి నాయుడు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఏ కార్యకర్తకు ఇబ్బంది కల్గినా ఆదుకొనుటకు తాము సిద్దంగా ఉన్నామన్నారు. వారి సుఖ సంతోషాల్లో పాలు పంచుకోవటం తమ కర్తవ్యం అని నాయుడు వివరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీని బలోపేతం చేసుకుంటూ కాపాడుకుంటూ వస్తున్నామని వివరించారు. కాగా మండలంలోని కాసరం టీడీపీ నాయకుడు వెంకట ముని కుమార్తె వివాహానికి తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు హాజరై నూతన వధూవరులను ఆశీర్వాదించారు.ఈ వివాహానికి ఆయనతో పాటు తిరుపతి పార్లమెంట్ యువత అధికార ప్రతినిధి చెన్ను రాఘవులు యాదవ్,మాజీ సర్పంచ్ శ్రీరామ్ చెంచయ్య, సంద్ర మహేష్ నాయుడు, బూత్ కన్వీనర్ బొర్రా గిరి, పల్లిపట్టి పరశురాం లు హాజరై నూతన వధువులను ఆశీర్వదించారు.

## మధుర మీనాక్షిరావుకి సన్మానం



***తిరుపతి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:*** తిరుపతి వేశాల మ్మ ఆలయ పాలకమండలి సభ్యురాలుగా నియ మి తులైన చిత్రపు మధుర మీనాక్షి రావును సన్మానిం చారు. గురువారం ఆలయంలో ఆమె ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ అధికారి పణిరాజ్ ఆమె చేత ప్రమాణ స్వీకారం చేయించారు. రాయలసీమ రంగస్థలం చైర్మన్, బిజెపి సీనియర్ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కళాకారులు నాయకులు మధుర మీనాక్షి రావుని దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. వేశాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. హనుమంతరావు, బిజెపి నాయకుడు తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, జనసేన పార్టీ నాయకుడు హరికృష్ణ విశ్రాంత ప్రిన్సిపాల్ స్వరాజ్య లక్ష్మి మ్మపాల్గొన్నారు.



## సంగీత నృత్య లలితకళల సదస్సు

**యూనివర్సిటీ(తిరుపతి), ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో సంగీత, నృత్య లలిత కళల విభాగంలో పి.ఎం ఉష యాక్టివిటీ 6 లో వర్క్ షాప్ జరిగింది. మొట్టమొదట గా మ్యూజిక్ థెరపీ వర్క్ షాప్ ను నిర్వహించారు. ఇందులో భాగంగా టిబెటియన్ సౌండ్ హీలింగ్ టీచర్ ,థెరపిస్ట్ అయిన మంజుల సింగ్ , డా .విఘ్నేశ్వరన్ సౌండ్ థెరపీ గురించి థెరఫీని అందరితో చేయించారు. అందులో స్ట్రెస్ గురించి ఫోన్ లో ఆటలను ఆడించి సౌండ్ థెరపీ కి సంబంధించిన వాద్యాల గురించి వాటిని ఎలా వాయిస్తారో తెలియజేశారు. సాధనా మెళకువలను విద్యార్థులు ఎలా సాధన చేయాలో సవివరంగా తెలియజేశారు. ఈ వర్క్ షాప్ కు యూనివర్సిటీలోని సోషల్ సైన్సెస్, సైన్సెస్ , ఫార్మసీ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్స్ నుంచి 150 మంది విద్యార్థినులు హాజరయ్యారు. ఈ సదస్సు కు రిజిస్ట్రార్ ఆచార్య ఆర్ . ఉష ,ఇంచార్జి డీన్ ఆచార్య కిరణ్ ప్రసాద్ ,విభాగాధిపతిఆర్. ఎన్ . ఎస్. శైలేశ్వరీ , డాన్స్ ఫ్యాకల్టీ హిమబిందు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీయటంలో ఎగ్జిబిషన్లు కీలకం

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**



మనిషి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలమని ఆ దశలో వారిని సరైన మార్గంలో నడిపే ఒకే వ్యవస్థ విద్యావ్యవస్త అని మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీ సాయిరాం ఇంగ్లీష్ మీడయం పాఠశాల సైన్స్ ఎగ్జిబిష న్‌ను నిర్వహించారు. పాఠశాల ఏర్పాటు చేసిన 18సంవత్సరాలు అయిన సందర్బంగా వార్షికోత్సవంతో పాటు సైన్స్ ఎగ్జిబీషన్‌ను నిర్వహించామని కరస్పాండెంట్ పి.మాలతి, ప్రధానోపాధ్యాయులు కె.సి కృష్ణ వివరించారు. ఎగ్జిబీషన్‌కు ముఖ్యఅతిధిగా విచ్చేసిన అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ సాయిరాం పాఠశాలను ఎంతో జవాబుదారి తనంతో నిర్వహిస్తున్న కృష్ణను అభినందం చారు.విద్యార్థులోనైపుణ్యాలను వెలికి తీయటానికి సైన్స్ ఎగ్జిబీషన్‌ను నిర్వహించి విద్యార్థులకు సైన్స్

## భక్తి శ్రద్దలతో శివయ్య ఆలయానికి శంకుస్థాపన



**శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు గ్రామ గిరిజన వాడలోని శివాలయ పునర్నిర్మాణానికి గురువారం భక్తి శ్రద్దలతో భూమి పూజలను నిర్వహించారు. ఇక్కడి ఆల య శిధిలావస్థ దుస్థితికి సంబంధించి స్థానిక శాసన సభ్యుడు సుధీర్‌రెడ్డి టిటిడి ఇఒ,ఛైర్మెన్‌లకు మొరబె ట్టుకున్నారు. టిటిడి శ్రీనిధి నుంచి రూ.20లక్షలు కేటా యించారు.గురువారం ఏర్పాటు చేసిన భూమి పూజ కార్యక్రమాలకు ముఖ్యఅతిధులుగా డివైయస్‌పి నరసింహామూర్తి, ఎక్సైజ్ సిఐ లావణ్య ఐసిడియస్ ప్రాజెక్టు అధకారి దుర్గా ప్రియాంకలుపాల్గొన్నారు.వారికి బొడి దేవాలయం కమిటి సభ్యులు అర్చకులు స్వాగతం పలికారు. ఇక్కడ కలశస్థాపనగావించి పూజలు నిర్వహించారు. హోమాలు వెలిగించారు. సుమారు30 సంవత్సరాల క్రితం ఇక్కడి దేవాలయంలో గుప్త నిధుల కోసం ఆలయాన్ని శిధిలం చేసారు. ఆ స్థానంలో కొత్త ఆలయానికి అవకాశంకల్పించిన శాసనసభ్యునికి గిరిజనుల ధన్యవాదాలు తెలిపారు.

## జానకి ఆరోపణలు అవాస్తవం – క్రాంతి కుమార్

**తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త**



రాజమండ్రికి చెందిన గంగ జానకి టీటీడీ ఉద్యోగిగా ఉన్న తనను కేవలం ఆస్తి కోసమే పెళ్లి చేసుకుందని, తనకు వారసత్వ సంపదగా వస్తున్న దుకాణాన్ని సైతం నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి చేజిక్కించు కోవాలని కుట్రతో నిందారోపణలు చేస్తోందని క్రాంతి కుమార్ స్పష్టం చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో కుటుంబ సభ్యులతో కలిసి క్రాంతికుమార్ మాట్లాడారు. 1950 దశకం నుండి తిరుమలలో తమ కుటుంబ సభ్యులము నివాసం ఉన్నాము. తిరుమల బ్రహ్మోత్సవాలకు కోలాట భజన బృందంతో వచ్చిన జానకి తనను గమనించి తన చుట్టూ తిరుగుతూ ప్రేమించానని చెప్పడంతో తాను పెళ్లి చేసుకోవడం జరిగిందన్నారు. 2018లో మాకు ఒక పాప పుట్టిందని తెలిపారు. 2024లో ఉద్యోగం పేరుతో హైదరా బాద్ కు వెళ్లిన గంగ జానకి తన మొదటి భర్త హజరత్ రెడ్డిని మళ్లీ పెళ్లి చేసుకున్నానని చెప్పి, విడాకులు కావాలని బెదిరింపులు చేసింద న్నారు. అప్పటినుండి మాకు వారసత్వ సంపదగా వస్తున్న దుకాణాన్ని నకిలీ డాక్యుమెంట్లతో ఆక్రమించి అనుభవిస్తుందన్నారు. 1985 నుంచి దుకాణాన్ని తమకు చెందినదిగా ప్రచారం చేస్తోందన్నారు. అయితే వాస్తవానికి 1985 నుండి తాము ఆ షాపును నిర్వహించు కుంటున్నామన్నారు. సమాజంలో టీటీడీ ఉద్యోగిగా ఒక గౌరవార్థమైన జీవితాన్ని గడుపుతుంటే ఆస్తికోసం మాపై దుష్ప్రచారాలు చేయడం దారుణం అన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు గంగ జానకి చేస్తున్న నిరాధార ఆరోపణలపై చర్యలు తీసుకొని తమకు రక్షణ కల్పించాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో క్రాంతి కుమార్ సోదరి లక్ష్మి, రవికుమార్, కవిత పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంపై ప్రజలలో ఎలాంటి అపోహలొద్దు

**– ఎంపీడీవో వాసుదేవరావు**



**పాకాల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త** జాతీయ ఉపాధి హామీ పథకం అమలుపై ప్రజలు ఎలాంటి అపోహ లకు లోను కారాదని పథకం యధాతథంగా అమల వుతుందని పాకాల ఎంపీడీవో వాసుదేవరావు పేర్కొ న్నారు. గురువారం స్థానిక పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వాసుదేవరావు చేతుల మీదుగా ఉపాధి హామీ పథకం అమలు పై అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును ఏప్రిల్ 1వ తేదీ నుండి వికసిత భారత్ జి రామ్ జిగా మార్పు చేస్తున్నారన్నారు. ఈ పథకంపై నేటి నుండి మార్చి నెల 25వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించినున్నట్లు తెలియజేశారు. కేవలం పేరును మాత్రమే మారుస్తున్నారని పథకం మరింత సమర్థవంతంగా యధాతధంగా అమలవుతుందన్నారు. ఉపాధి హామీ పథకం రద్దవుతోందంటూ ప్రజలలో అనేక అపోహలు ఏర్పడ్డాయని వీటిని నివృత్తి చేసేందుకే క్షేత్రస్థాయిలో ఆరు వారాలపాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఉపాధి పని దినాలను 100 రోజుల నుండి 125 రోజులకు పెంచడమే కాకుండా ఆధునిక సాంకేతికత ద్వారా సమర్థవంతంగా పథకం అమలు అవుతుందన్నారు. సమయానికి కూలీల చెల్లింపు జరుగుతుందని, ఆలస్య చెల్లింపులకు పరిహారం అందజేస్తారని తెలిపారు. కావున ప్రజలు ఈ పథకంపై అనవసరమైన అనుమానాలు పెంచుకోవద్దని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో ఆశా రాణి, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్ గీత, ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, శేషాద్రి ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి విరాళం



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది. ఈ నేపధ్యంలో గురువారం స్వామి అమ్మవార్లను దర్శించుకొని మహారాష్ట్రలోని బారామతి కి చెందిన భక్తులు నిత్యాన్నదాన పథకంలో భోజనం చేసిన తరువాత ఎఇఓ మోహన్‌తో తాము విరాలం ఇవ్వాలనుకుంటున్నట్లు వివరించారు. ఈ పథకానికి బారామతికి చెందిన శ్రీలలిత్ తాంతియా రూ.51వేలు విరాళాన్ని ఎపిఆర్ఓ రవి ద్వారా ఎఇఓ మోహన్‌కు అందజేసారు. వారికి ప్రత్యేకాశీర్వచనాలతో పాటు అంతరాలయ దర్శనం, వేదపండితులచే ఆశీర్వచనాలు అందించారు.

## పరశురామేశ్వరుని దర్శించుకున్న మౌర్య



**ఏర్పేడు,ఫిబ్రవరి 26 ప్రభాతవార్త** ఏర్పేడు మండలంలోని గుడిమల్లాం అలయం లో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరుని గురువారం తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య దర్శించుకున్నా రు. వారికి ఆలయ మర్యాదలతో వేదపండితులతో ఆలయ ఇఒ రామచంద్రారెడ్డి స్వాగతం పలి కారు. ఈ సందర్బంగా ఇక్కడ సూచిక బోర్డులను ఏర్పాటు చేసిన కమిషనర్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. వేదపండితులచే ఆశీ ర్వనాలు అందించారు.

## పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జై సారధి



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తిలోని 12వ అదనపు అడిషనల్ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది దారపనేని జైసారధిని నియమిస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు జారి చేసింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు అందాయి. ఆయన్ను పలువురు అభినందించారు. జై సారధి మాట్లాడుతూ తాను గత 30 సంవత్సరాలుగా శ్రీకాళహస్తిలో న్యాయవాదిగా విధులు నిర్వహి స్తున్నానని వివరించారు. ఓ వైపు న్యాయవాదిగా ఉంటూ పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. తన సేవలను గుర్తించిన ప్రభుత్వం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ పదవిలో తాను తన వద్దకు వచ్చినప్రతి ఒక్కరికి సహాయం చేస్తూ న్యాయం అందేలా చూస్తానన్నారు. తాను న్యాయపక్షాన నిలబడతానని వివరించారు.న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికపాటి రమేష్‌బాబు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్లీడర్‌గా కమలాకర్

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి న్యాయస్థానాల సముదాయాల్లో విధులు నిర్వహిస్తున్న కె.కమల కుమార్‌కు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ పదవి దక్కింది. చాలాకాలంగా న్యాయ వాద వృత్తిలో కొనసాగుతున్న కమ లాకర్‌ను గుర్తించి ప్రభుత్వం అసిస్టెంట్ గవర్న మెంట్ ప్లీడర్‌గా నియమించారు. ఆయన సీనియర్, జూనియర్స్ సివిల్ జడ్జి కోర్టుల్లో కేసులను పర్యవేక్షిస్తారు.

## జనసేన సభ్యత్వంలో తిరుపతిని మొదటి స్థానంలో నిలుపుతాం: ఆరణి మదన్

**తిరుపతి విద్య ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**

జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎమ్మెల్యే శ్రీనివాసులు కార్యాలయ ఆవరణలో ఆరణి మదన్ గురువారం ఉదయం ప్రారంభించారు. ఆరణి మదన్ తన సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకుని సభ్యత్వాన్ని ప్రారంభించారు. జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదులో పార్టీ నాయకులు, వీరమహిళలు, సాదక్ లు కీలకంగా వ్యవహరించాలని ఆరణి మదన్ కోరారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు ఇంటింటికి తీసుకెళ్ళడంతోపాటు క్షేత్రస్థాయిలోని సమస్యలు తెలుసుకోవాలని ఆయన కోరారు. 2023లో నాలుగువేల నూట ఇరవై నాలుగు మంది సభ్యత్వం తిరుపతిలో ఉంటే 2025 నాటికి పదహారు వేల అరవై ఐదు మందికి చేరి రాయలసీమలో మొదటి స్థానంలో నిలిచిందని ఆయన వివరించారు. జెన్ జీ తరాన్ని పార్టీకి చేరువ చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు.

## శ్రీ ఉగ్ర ప్రత్యంగిరా అమ్మవారికి శాస్త్రసోక్తంగా ఛండీహోమం



***చంద్రగిరి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:*** శ్రీ ఉగ్రప్రత్యం గిరా అమ్మవారికి పీఠాధిపతి సూరి స్వామి ఛండీ హో మం శాస్త్రోకంగా నిర్వహించారు. తొండవాడ పంచా యతీలో వెలసిన శ్రీ ఉగ్రప్రత్యంగిరా కాళీ పీఠంలో పీఠాధిపతి సూరి స్వామి ఆలయ 17వ వార్షికోత్సవ ఉత్సవాలలో గురువారం విశేష సేవలు నిర్వహిం చారు. ఇందులో భాగంగా వేదపండితులు జి.సీతారా మశాస్త్రి, కార్యనిర్వహకులు పూజారి శివశంకరప్రసాద్, వడికాసుల రామమూర్తి నాయుడు ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుండి 7:30 గంటల వరకు అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. 8 గంటలకు ప్రాతఃకాలార్చన, చండీహోమము, హనుమ గాయత్రి హోమము, జయాది హోమము, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన నిర్వహించారు. తదుపరి సహస్రకళశాభిషేకం, అలంకారం, సువాసినీ పూజ, అర్చన, నైవేద్యం, మంత్రపుష్పం, హారతి, తీర్థప్రసాద వినియోగం గావించారు. సాయంత్రం శ్రీప్రత్యంగిరా సహస్ర నామార్చన, హారతి, తీర్థ ప్రసాద వినియోగం గావించారు. ఈ హోమాధి కార్యక్రమంలో దాతలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## బాల్య వివాహ నిర్మూలనపై ప్రజల్లో చైతన్యం

**పిహెచ్‌సి అండ్ ఐసిడిఎస్ విస్తృత ప్రచారం**



**చంద్రగిరి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:**బాల్య వివాహ నిర్మూలన లక్ష్యంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావా లని చంద్రగిరి పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ బొల్లినేని కుసుమ, డాక్టర్ రాసినేని శిరీష, ఐసిడిఎస్ సిడిపిఓ పి.ఆర్.ప్రదీప అన్నారు. స్థానిక పిహెచ్‌సిలో గురువారం బాల్య వివాహ రహిత సమాజ స్థాపన లక్ష్యం అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా 100 రోజుల జాతీయ ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎం.ఎల్.హెచ్.పిలకు బాల్య వివాహ నిర్మూలనపై దిశా నిర్దేశం చేశారు. 2025 నవంబర్ 27 నుండి 2026 మార్చి 8 వరకు సాగే ప్రచారంలో క్షేత్ర స్థాయిలో బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించి చైతన్యం తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఇందులో స్త్రీ శిశు సంక్షేమశాఖ పాత్ర ఎంత కీలకమో వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ధన, వాసుదేవ రెడ్డి, శివరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఏసి మెకానిక్ ఆత్మహత్య



**చంద్రగిరి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** ఏసి మెకానిక్ షేక్ జాఫర్ సాధిక్ (22) బుధవారం రాత్రి తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ సురేష్‌కుమార్ తెలిపారు. కడప జిల్లా, మామిళ్ళపల్లి, చింతకొమ్మ దిన్నెకు చెందిన మహ్మద్ రఫీ కుమారుడు గత రెండేళ్ళుగా ఆర్ఎఫ్ రోడ్డులో నివశిస్తూ ఏసి మెకానిక్‌గా అజీజ్ వద్ద పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి చంద్రగిరి కావమ్మ గుడి వీధిలోని అజీజ్ నివానికి వెళ్ళి భోజనం చేసుకుని తిరిగి తన గదికి చేరుకున్నాడు. గురువారం ఉదయం షాపుకు వెళ్ళకపోవడంతో అజీజ్ ఫోన్ చేయగా స్విఛాఫ్ రావడంతో గదికి వెళ్ళి పరిశీలించాడు. అయితే గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన జాఫర్‌ను చూసి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ అరుణాచలం తమ సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకుని శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

## కళ్ళం ధ్వంసం చేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌పైనే ఫిర్యాదు చేశాం.!

**ఉప్పిల వంక గ్రామస్థులు**



***రామచంద్రాపురం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:*** అనుపల్లి పంచాయతీ, ఉప్పిలివంక సమీపంలోని దద్దనాల బండపై ప్రభుత్వం వాటర్ షెడ్ పథకంలో నిర్మించిన కళ్ళంను ధ్వంసం చేసిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నరశింహారెడ్డిపైనే తాము ఫిర్యాదు చేశామని ఉప్పిల వంక గ్రామస్థులు చిన్నమ రెడ్డి, వెంకట రెడ్డి, ఇరగం రెడ్డి అన్నారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ అన్వర్ భాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన గుణసుందరి వ్యక్తి గత కక్షలతో బుధవారం తహశీల్దార్ మధుసూదన్ రావుకు కొందరిపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమకు గ్రామస్థులపై ఫిర్యాదు చేస్తామని చెప్పకుండా తన వాహనంలో తీసుకువచ్చి అర్జీలపై సంతకాలు చేయించుకున్నట్లు తెలిపారు. ఆమె మాటలు నమ్మి మోసపోయి అర్జీలో సంతకం చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. గుణసుందరి తహశీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదుకు మాకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. కళ్ళంను ధ్వంసం చేసిన వారిపై ఉన్నత స్థాయి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పిలివంక గ్రామస్థులు వై.ఇరగం రెడ్డి, బి.బాలచంద్రారెడ్డి, వై.హేమశేఖర్ రెడ్డి, వై.కేశవులు రెడ్డి, బి.వాసుదేవ రెడ్డి, కె.మంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణదేవరాయల వారి జయంతి వేడుకలను అధికారంగా నిర్వహించాలి.!



**జాతీయ కాపు సంఘం ప్రచార కార్యదర్శి గోపి రాయల్**

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** శ్రీకృష్ణదేవ రాయల వారి జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభు త్వం అధికారికంగా నిర్వహించాలని జాతీయ కాపు సంఘం ప్రచార కార్యదర్శి గోపి రాయల్ అన్నారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ అన్వర్ భాషాను కలసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలిజ, కాపు కులాల ఆరాధ్య దైవం శ్రీకృష్ణదేవరాయలని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన ప్రాచీన రాజుల జాబితాలో శ్రీకృష్ణదేవరాయల వారి పేరును చేర్చకపోవడం భాధాకర మన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాలలో సిఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు జోక్యం చేసుకుని రాయల వారి జయంతి, వర్ధంతి వేడుకలను అధికారి కంగా నిర్వహించే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. కాపు సంఘం నాయకులు జెడి జగన్, చిరంజీవి రాయల్, ఈశ్వర్ రాయల్, నరేంద్ర రాయల్, ధనంజయ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక భద్రతకు అక్షరాస్యతే బాట

**కేవీబీ పురం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:**

కేవీబీ పురం మండలంలోని కాళంగి గ్రామంలో విడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థికఅక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేట్‌బ్యాంక్ మేనేజర్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు బ్యాంకింగ్‌సేవలు, బీమా పథకాలు, సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు తప్పని సరిగా కేవైసీ, సఈ3కేవైసీ, ఈకేవైసీ పూర్తి చేసుకోవడం ద్వారా ఖాతా నిర్వహణలో ఎలాంటి అంతరాయం ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకాల ప్రాముఖ్యతను వివరించి తక్కువ ప్రీమియంతో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.కౌన్సిలర్లు క్రాంతికుమార్, కార్తీక్, జానకిరా మయ్య పాల్గొన్నారు.

## నల్లకన్నుకు ఘనంగా నివాళులర్పించిన దళిత నాయకులు



**నాగలాపురం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** స్వాతంత్ర సమరయోధుడు తమిళనాడు కమ్యూనిస్టు పార్టీ సీని యర్ నాయకుడు నల్ల కన్ను 101 సంవత్సరాల వయసులో అనారోగ్యంతో చెన్నైలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించడం దేశానికి ముఖ్యంగా మన రాష్ట్రానికి తీరని లోటని సీపీఎం నాగలాపురం మండల నాయకుడు మురుగేష్ తెలిపారు. మండల కేంద్రం నాగలాపురంలో నల్లకన్ను చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.దామోధరం, ప్రదీప్‌రాజ్, చిన్నా, వనరాజ్, వెంకటేష్, మనో, ప్రశాంత్,పాల్గొన్నారు.

## జన సేన సభ్యత్వ నమోరుకు శ్రీకారం

**తొట్టంబేడు ఫిబ్రవరి 26 ప్రభాతవార్త**



తొట్టంబేడు మండలంలో జనసేన సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారు. మండలంలో పార్టీ కార్యక్రమాలను అమలు చేస్తున్న పేట బ్రదర్స్ సారధ్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. మండలంలో ప్రజల సాధక బాధకాల్లో పాలు పంచుకుంటూ ప్రజలు,అధికారులకు మధ్య వారధిగా వ్యవహరిస్తున్న నాయకులు సభ్యత్వ నమోదుకు ప్రాధన్యాత ఇచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం రాష్ట్రమంతటా ప్రారంభమైన సందర్భంగా పార్టీ అధిష్టానం పిలుపుమేరకు జనసేన పార్టీ నాయకులు పేట బ్రదర్స్ మిత్ర బృందం ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీకారం చుట్టారు.పార్టీ పిలుపు మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని జనసేన పార్టీ అభిమానులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభిమానులు, ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. సభ్యత్వం రుసుము 400 రూపాయలు దీని ద్వారా సభ్యత్వం తీసుకున్నటువంటి వ్యక్తికి ప్రమాదవశాత్తు ఏమైనా జరిగినట్లయితే 5 లక్షల భీమా తో పాటుమన నాయకుడు పవన్ కళ్యాణ్ ఆ కుటుంబానికి అండగా తన వంతు సహాయంగా ఇస్తున్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## లైసెన్స్ లేకుండా వ్యాపారం... నేరం : కమిషనర్



నాయుడుపేట, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: పురపాలక సంఘంలోని వ్యాపారస్థులను మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజురుల్లా గురువారం వ్యాపారస్తుల షాపులకు వెళ్లి యజమానులతో కలిసి మాట్లాడారు. ప్రతి ఒక్క వ్యాపారస్తుడు కూడా ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహించకూడదని షాపుల యజమానులకు తెలియజేశారు. తమ తమ షాపు యొక్క ట్రేడ్ లైసెన్స్ ఫీజును ఎటువంటి పెనాల్టీ రుసుము లేకుండా ఫిబ్రవరి 28లోపు చెల్లించుకోవచ్చని అన్నారు. అలా చెల్లించుకొని ఎడల మార్చి 31లోపు 25శాతం అదనపు చార్జీలతో చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. మార్చి దాటిన తరువాత 50 శాతం పెనాల్టీతో చెల్లించవలసి వస్తుందని అన్నారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేయడం చట్టరీత్యా నేరం అందువల్ల అందరూ వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా పొందాలని సూచించారు. లేనియడల సదరు వ్యాపారస్థులకు నోటీసు ఇచ్చి కోర్టులో కేసు ఫైల్ చేసి కోర్టు ద్వారా జరిమాన విధించబడుతుందని వారు ఈ సందర్భంగా తెలియజేశారు.

## విలేజ్ విజిటింగ్‌లో పెళ్లకూరు పోలీస్



పెళ్లకూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: మండలంలోని కొత్తూరు పంచాయతీలో గురువారం నాడు రాత్రి విలేజ్ విజిటింగ్‌లో భాగంగా పెళ్లకూరు పోలీసులు ఎస్ఐ ఆదిలక్ష్మి నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వర రావు కొత్తూరు గ్రామంలో సందర్శించి ఇప్పుడు జరుగుతున్నటు వంటి సైబర్ నేరాలు, దొంగతనాలు, గంజాయి రవాణా మొదలైన విషయాల గురించి అవగాహన కల్పించారు. ఏదైనా అనుకోని సందర్భంలో విపత్తులు సంభవించి నప్పుడు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు రక్షణపరమైన ఎలాంటి ఇబ్బందులు సంభవించిన పోలీసులు ఎప్పుడూ మీకు అండగా ఉంటారని ప్రజలకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు సర్పంచ్, పెళ్లకూరు మండలం తెదేపా అధ్యక్షులు సంచి కృష్ణయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

## ఆక్రమణ చెరువును పరిశీలించిన అధికారులు



వాకాడు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: వాకాడు మండలం పాతేట్టి పాలెం గ్రామంలో అక్రమంలో వున్నా 190 ఎకరాల భూములు, చెరువులను వార్త కథనాల్లో రావడంతో ప్రభుత్వ ఆదేశాలతో స్పందించిన అధికారులు పరిశీలించారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి నాయకత్వంలో బిజెపి నాయకులుతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌లో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి, పూర్తిస్థాయిలో ఆ కంపెనీలో ఉన్న 190 ఎకరాలు చెరువులను ఆక్రమంలో ఉన్నాయని వివరించారు. మండల స్థాయి అధికారులు స్పందించికపోవడంతో గత మూడు రోజుల క్రితం మండల తహసిల్దారును పురుషోత్తంరెడ్డి బృందం కలిసి వివరణ కోరడం, అనంతరం స్థానిక విలేకరుల సమావేశంలో పురుషోత్తంరెడ్డి తన ఆవేదనతో ఆ సమస్యను వివరించారు. ఆ సమస్యపై సర్వే చేపట్టాలని ఆదేశించడంతో గురువారం రెవిన్యూ యంత్రాంగం సర్వే నిర్వహించారు. సర్వే నివేదికను తహసిల్దార్ అందజేస్తామని సర్వే అధికారులు తెలిపారు.

## నిషేధిత ప్లాస్టిక్ బ్యాగులు స్వాధీనం



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: పట్టణంలో మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది గురువారం వివిధ వ్యాపార సంస్థలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 115 కేజీల ప్లాస్టిక్ కవర్లు, బ్యాగులు, గ్లాసులు స్వాధీనం చేసుకుని 5,100 రూపాయలు జరిమానా విధించారు. 120 మైక్రాన్ల లోపు ఉండే ప్లాస్టిక్ కవర్లను వినియోగించాలని కమిషనర్ కె.చిన్నయ్య సూచించారు. వ్యాపారులు ఇందుకు సహకరించాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని ఏర్పాటు చేయండి

**- కమిషనర్‌కు వైస్ చైర్మన్ బాలయ్య, కౌన్సిలర్లు విజ్ఞప్తి**



వెంకటగిరి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: తమ పదవీకాలం ముగియనున్నందు వల్ల మున్సిపల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కమిషనర్ ఈగ కిరణ్‌ను కోరినట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ చేతురాశి బాలయ్య తెలిపారు. వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కిరణ్‌ను వైస్ చైర్మన్, కౌన్సిలర్లు కలిసి సమస్యలను తెలియజేశారు. మార్చి నెల 18వ తేదీతో కౌన్సిలర్ల పదవీకాలం ముగుస్తుందని తెలిపారు. బడ్జెట్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎంఎ నారాయణ, ధనియాల రాధా, శ్రీనివాసులు, తంబా సుకన్య, నాయకులు మురళి కృష్ణ, రాజారెడ్డి, శ్రీనివాసులు, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

## వాకాడులో విద్యుత్ అదాలత్



వాకాడు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త : మండల కేంద్రమైన వాకాడులోని గురువారం 33/11 కేవీ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ అదాలత్ కార్యక్రమం జరిగింది. మండలంలోని విద్యుత్ ఆదాలత్‌లో మూడు అర్జీలు వచ్చాయని ఏ ఈ విజయలక్ష్మి తెలిపారు. మండలం లోని కల్లూరు కొత్తపాలెం గ్రామంలోని ఆర్డిఎస్ఎస్ ద్వారా త్రీఫేస్ ఇవ్వాల్సిన స్తంభాలకు సింగల్ ఫేస్ ఇస్తున్నారని, బుర్ల వారి పాలెంలో ఇంటి స్లాబ్ ఆదికల్లోడుతో వస్తుందని, బాలిరెడ్డి పాలెం ట్రాన్స్‌పార్మర్‌లో వోల్టేజ్ వస్తుందని అర్జీలు వచ్చాయని అన్నారు.పై విషయంలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులు విజయలక్ష్మికి పరిశీలించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి శ్రీనివాసుల ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు మధు కుమార్, సాంకేతిక సభ్యులు శ్రీనివాస్ బాబు, డిఈవి నరేంద్రరెడ్డి, ఏఈలు విజయలక్ష్మి, శశికళ, ట్రాన్స్కొ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర ధర్నాను జయప్రదం చేయండి



నాయుడుపేట, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: సిఐటియు కార్యాలయంలో ఆశ వర్కర్లు మార్చి 5వ తేదీ జరుగు రాష్ట్ర ధర్నాకు ఆశ వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని గురువారం పాంప్లెట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి. లక్ష్మి మాట్లాడుతూ ఆశ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌కు కనీస వేతనం 26,000 చెల్లించాలని ఆశా వర్కర్లను, పర్మినెంట్ చేయాలన్నారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు శివకవి ముకుంద మాట్లాడుతూ ఆశ వర్కర్ల నుండి ఎట్టి చాకిరి చేపిస్తున్నారు అని అన్నారు. ఈ విధానాలు ఇంకనైనా మానుకోకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు సుజాత, జిల్లా కమిటీ సభ్యులు మునిరత్నమ్మ, కోటమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎంని కలిసిన నేదురుమల్లి



వెంకటగిరి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త : మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కలిశారు. వెంకటగిరి నియోజకవర్గంలో కూటమి వారి అరాచకాలు పెరుగుతున్నాయని నేదురుమల్లి తెలియజేశారు.

## సూళ్లూరుపేట ఇన్‌ఛార్జ్ ఆర్డీఓగా దేవేంద్రరెడ్డి



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: సూళ్లూరుపేట ఇన్‌ఛార్జ్ ఆర్డీఓగా వి.దేవేంద్రరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న వి.దేవేంద్రరెడ్డి సూళ్లూరుపేటకు ఇన్‌ఛార్జ్ ఆర్డీఓగా పూర్తి బాధ్యతలు కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ ఆర్డీఓగా పనిచేస్తున్న కిరణ్మయి హైకోర్టు కేసు నేపథ్యంలో డిఎడిలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆమె ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. భూకబ్జాలు చేస్తే ఎంతమాత్రం సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని తెలిపారు.

## అందరికీ అండగా సభ్యత్వం : ఉయ్యాల



నాయుడుపేట, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: సూళ్లూరుపేట నియోజకవర్గం, నాయుడుపేట జనసేన పార్టీ కార్యాలయం నందు గురువారం ఉద్యమి సభ్యత్వ నమోదు శిబిరాన్ని సూళ్లూరు పేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ మరియు ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ అట్టహాసంగా ప్రారంభించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ వ్యవస్థాప కులు పవన్ కళ్యాణ్ వారి ఆదేశాలతో ఉద్యమి ఉద్యమి కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఇందులో జన సైనికులకు వీర మహిళలకు, కార్యకర్తలకు, అభిమానులకు, ఎన్నో రకాల ప్రయోజనాలు ఉంటాయన్నారు. సరికొత్త రాజకీయ వ్యవస్థలో భాగస్వామ్యులు కావాలని ఉయ్యాల ప్రవీణ్ పిలుపునిచ్చారు.

## విరివిగా జనసేన సభ్యత్వ నమోదు



వెంకటగిరి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశం మేరకు వెంకటగిరి నియోజకవర్గంలో విరివిగా పార్టీ సభ్యత నమోదు చేస్తున్నట్లు ఆ పార్టీ నేత రామారావు అనిల్ కుమార్ తెలిపారు. గ్రామ శక్తి పోలేరమ్మ గుడి వద్ద పూజలు నిర్వహించి జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్ని ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాజేష్, రాధమ్మ, రవిశంకర్, వెంకటేశ్వరరావు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి : జిల్లా కలెక్టర్



విజయపురం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: త్వరలో ఐటీఐ కళాశాలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఐఎఎస్ పేర్కొన్నారు. గురువారం విజయపురం మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ క్షేత్ర స్థాయిలో సందర్శించి ఐటీఐలో ఎలక్ట్రికల్, ఫిట్టర్, ఆటో మొబైల్, మోటారు మెకానిక్, కార్పెంటర్, సివిల్ ట్రేడ్‌లను, డీజిల్ మెకానిక్ వివిధ విభాగాలను, కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని, ఈ కోర్సులు సద్వినియోగం చేసుకుని మంచి ఉద్యోగాలు పొందాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కళాశాలకు కావలసిన అన్ని మౌలిక వసతుల కల్పనకు నిధులు ఎంత మేర అవసరమో నివేదిక అందజేయాలని కలెక్టర్ ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రాజేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ కాలభైరవ, లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్విమ్స్‌లో అత్యున్నత ప్రమాణాలతో వైద్య సేవలు

**- టిటిడి జె.ఇ.ఓ (హెచ్ అండ్ ఇ) డా.ఎ.శరత్**
**- ఘనంగా స్విమ్స్ 33వ వార్షికోత్సవ వేడుకలు**




తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: సనాతన ధర్మంలో పేర్కొన్న విధంగా మానవసేవే మాధవ సేవగా స్విమ్స్ వైద్యులు రోగులకు అత్యున్నత ప్రమాణాల తో వైద్య సేవలందిస్తున్నారని టిటిడి జెఇఓ (హెచ్ అండ్ ఇ) డా. శరత్ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఇఓ ముద్దాడ రవిచంద్ర సహకారంతో స్విమ్స్‌ను ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశంలోనే ఉత్తమ హాస్పిటల్‌గా తీర్చి దిద్దడానికి కృషి చేస్తామన్నారు. శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) 33వ వార్షికోత్సవాన్ని గురువారం సాయంత్రం మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జెఇఓ (హెచ్ అండ్ ఇ) డా. ఎ.శరత్ మాట్లాడుతూ శ్రీవారి ఆశీస్సులతో స్విమ్స్‌కు రూ. 130 కోట్ల వార్షిక గ్రాంట్‌ను అందజేయడం ద్వారా రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతోందని తెలియజేశారు. వైద్యో నారాయణో హరి అన్నట్టుగా వైద్య జ్ఞానానికి ఆధ్యాత్మికతను జోడిస్తేనే రోగులకు సంపూర్ణ వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. స్విమ్స్‌ను జాతీయ ప్రాధాన్యతగల వైద్య సంస్థగా తీర్చిదిద్దేందుకు వైద్యులు, ఇతర సిబ్బంది మరింత అంకితభావంతో పాటుపడాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ఔట్ పేషంట్లను మరింత పెంచుకోవాలని సూచించారు. పేద రోగులకు అందించే డాక్టర్ ఎన్.టి.ఆర్ వైద్య సేవలు మరింత విస్తృతం చేయాలని తెలిపారు. టి.టి.డి ఉద్యోగులతో పాటు ఇతర ఉద్యోగులు, ప్రజలు స్విమ్స్‌కు వచ్చి వైద్య సేవలు పొందేలా భరోసా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమానికి తిరుమల తిరుపతి దేవస్థానముల జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జె.ఇ.ఓ (హెచ్ ఇ) డా ఎ.శరత్, అమెరికాకు చెందిన ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్ డా. సుభాషిణి యాటూరి, టి.టి.డి.బోర్డు సభ్యులు జి. భానుప్రకాష్ రెడ్డి గారు, స్విమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు, టి.టి.డి. బోర్డు సభ్యులు ఎన్.సదాశివ రావు, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్, డీన్ డా. అలోక్ సచన్, రిజిస్ట్రార్ డా. అపర్ణ ఆర్ బిట్లా, మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉషా కళావత్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా. శిల్పా కడియాల, అల్లైడ్ హెల్త్ సైనెస్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా. సురేష్, బయో ఇన్ఫర్మేటిక్స్, బయో టెక్నాలజీ కోఆర్డినేటర్ డా. అభిజిత్ చౌదరి, కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి ప్రిన్సిపాల్ డా. మాధవి, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డా. సుధారాణి సంయుక్తంగా జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. టి.టి.డి. జె.ఇ.ఓ., డా. ఎ.శరత్, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా.ఆర్.వి.కుమార్ చేతుల మీదుగా డా. సుభాషిణి, డా. కమలాకర్ రెడ్డి ఎండోమెంట్ గోల్డ్ మెడల్స్, బెస్ట్ పేపర్ అవార్డు, గోల్డ్ మెడల్ ఫర్ యాన్యువల్ నెఫ్రాలజీ వ్యాసరచన పోటీలు, డా. దక్షిణామూర్తి యాన్యువల్ గోల్డ్ మెడల్ ఫర్ బెస్ట్ నెఫ్రాలజీ థీసిస్, డా. నీలా ప్రసాద్ గోల్డ్ మెడల్ ఫర్ నెఫ్రాలజీ వ్యాస రచన పోటీలు, డా. శివకుమార్ గోల్డ్‌మెడల్ ఫర్ యాన్యువల్ నెఫ్రాలజీ వ్యాస రచన పోటీలు, అప్రిసియేషన్ సర్టిఫికేట్స్ ఫర్ బెస్ట్ పేపర్ అవార్డ్స్, డా. వి. జయరామ్, లలిత జయరామ్ గోల్డ్ మెడల్ ఫర్ టాపర్ ఇన్ ఎం.బి.బి.యస్, డా. పద్మాజ మునస్వామి గోల్డ్ మెడల్ ఫర్ ఔట్ స్టాండింగ్ నర్సింగ్ నర్సింగ్ సర్వీసెస్‌లను వైద్యులకు, పి.జి. విద్యార్థిని విద్యార్థులకు ఎం.బి.బి.ఎస్ విద్యార్థులకు ప్రదానం చేశారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టిటిడి జెఇఓ నేతృత్వంలో స్విమ్స్ ఉన్నత శిఖరాలు అందుకుంటుందని స్విమ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరియు టి.టి.డి వారు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని భావిస్తున్నానన్నారు. స్విమ్స్‌లో తొలి పాలియేటివ్ కేర్‌గా తీర్చిదిద్దడానికి డా. సుభాషిణి రూ. 2 కోట్ల విరాళంగా ఇవ్వడానికి ముందుకు వచ్చారని ఈ రోజు రూ. 1 కోటి చెక్కును టి.టి.డి. జె.ఇ.ఓ. అధికారులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డా. సుభాషిణికి జె.ఇ.ఓ. శరత్ శాలువాతో సత్కరించి, మెమోంటోతో సన్మానించారు. టి.టి.డి. బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమకే తలమానికంగా వున్న ఏకైక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ స్విమ్స్ అని చెప్పడానికి గర్వంగా వుందన్నారు.డాక్టర్ సుభాషిణి మాట్లాడుతూ స్విమ్స్ నందు వైద్య సేవలు చాలా బాగున్నాయని ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశంలోనే అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తుడా ఛైర్మన్, టి.టి.డి. బోర్డు ఎక్స్ ఆఫీషియో సభ్యులు డాలర్స్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సారిగా లివర్, కిడ్నీ, హార్ట్ మార్పిడి చేసిన ఘనత స్విమ్స్‌కు దక్కిందన్నారు. స్విమ్స్‌కు వచ్చే పేషంట్స్ కొరకు డాలర్ ట్రస్టు ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ నుండి ఉచిత వాహనంను త్వరలో ఏర్పాటు చేస్తానని చెప్పారు. ముందుగా యూనిఫెస్ట్ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చివరిగా యూనివర్శిటీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

### డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్ పరిశోధనా సంస్థకు...

## జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు



తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: న్యూఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవనంలో మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారు నిర్వహించిన అవార్డ్స్ కార్యక్రమంలో పరిశోధనలపై ఎస్వీ వైద్య కళాశాల దేశంలోనే ప్రథమ స్థానంలో నిలబడటంతో జాతీయస్థాయి ర్యాంకింగ్లో ఎస్వీ వైద్య కళాశాల ఎంఆర్‌యు పరిశోధన సంస్థకి అవుట్ స్టాండింగ్ పర్ఫామెన్స్ చూపించి నందుకు గాను, ఉత్తమ పనితీరుకు కనపరిచినందుకు గాను సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నామని ఈ సందర్భంగా న్యూఢిల్లీకి వెళ్లి ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవి ప్రభు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్వి వైద్య కళాశాల ప్రిన్సిపాల్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ కిరీటి కేంద్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ నుండి మెమెంటో, సర్టిఫికేట్ అందుకున్నారు. ఈ కార్యక్రమం న్యూఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్‌లో నిర్వహించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశోధనా సంస్థ నోడల్ అధికారి డా. ఏఎస్ కిరీటి, సైంటిస్ట్ డా. పి మధుసూదన తదుతరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతలో తిరుమల డిపో భేష్

**-ఆర్టీసి సిబ్బంది సేవలు అభినందనీయం**



తిరుమల, ఫిబ్రవరి26ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతి జిల్లాలోని అన్ని ఆర్టీసి డిపోల బస్సుల కంటే తిరుమల డిపో సిబ్బంది మెరుగైన శుభ్రత నిర్వహిస్తు న్నారని జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీశ్ అబినందించారు. తిరుమల డిపో ఉద్యోగులు, సిబ్బంది సేవలను అభినందిస్తూ చిన్నపాటి గుర్తింపుగా వారందరినీ గురువారం మధ్యాహ్నం శాలువాతో సత్కరించారు. డిప్యూటీ సిఎంఇ బాలాజీ బస్సులను శుభ్రపరిచే సిబ్బంది ప్రత్యేక సేవలను కొనియాడారు. తిరుమల డిపో మేనేజర్ మునిచంద్ర, ఎంఎఫ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యాలయంలో సిబ్బంది సంక్షేమం గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో ఆర్టీసి డిపో సిబ్బందిటీ.కృష్ణప్ప, టీ.పురుషోత్తం, డి. నారాయణ, ఎస్.వి.రమణ, టీ.రమేష్, ఎస్.రాధారాణి, టీ.తిరుపతమ్మ,ఎస్.అనుసూయ, సి.రాజేశ్వరి, కే.రాజేశ్వరి, యం.దొరసానమ్మ, సెక్యూరిటీ సిబ్బంది, పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



కాణిపాకం, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భకురాలు శుక్రవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తిరుపతికి చెందిన భోజనంపాటి కస్తూరమ్మ అనే భక్తురాలు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,00,216 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ మోహన్‌నాయుడు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ఇయర్లీ ప్యాటర్న్ పరీక్షలు ప్రారంభం

తిరుపతి విద్య, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: ఎస్వీయూ పరిధిలో ఇయర్లీ ప్యాటర్న్ అభ్యర్థుల కోసం నిర్వహిస్తున్న సప్లమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. గత పది ఏళ్లుగా సబ్జెక్టులు పెండింగ్లో ఉన్న అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకుని పరీక్షలు రాశారు. సుమారు 50ఏళ్ల వయస్సు దాటి అభ్యర్థులు సైతం పరీక్షలు హాజరుకావడం విశేషం. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణపై వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ రాజామాణిక్యం మాట్లాడుతూ ఇయర్లీ ప్యాటర్న్ అభ్యర్థుల కోసం ఎస్వీయూలోని ఆర్ట్స్,సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలలో తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది అని తెలిపారు. ఫస్ట్ ఇయర్ పరీక్షకు 91 శాతం మంది విద్యార్థులు హాజరుకాగా థర్డ్ ఇయర్ పరీక్షలకు 90శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని చెప్పారు.

## శ్రీసిటీలో జాతీయ భద్రతా వారోత్సవాలు ప్రారంభం



సత్యవేడు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: 55వ జాతీయ భద్రతా వారోత్సవాలు గురువారం శ్రీసిటీలో ప్రారంభమైంది. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ జెండా ఊపి లాంఛ నంగా దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీసిటీ సిబ్బంది, స్థానికులకు ఈ కార్యక్రమం ప్రాధాన్యతను వివరించి వారిచే భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో యాక్సిడెంట్లు, ఇతర ప్రమాదాలు నివారించడానికి భద్రతా అంశాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు అవగాహన పెంచడమే ఈ భద్రతా వారోత్సవాల లక్ష్యం అన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు వివిధ అవగాహన కార్యక్రమాలతో పాటు భద్రత ప్రధానాంశంగా శ్రీసిటీ ఉద్యోగులు, ఈ ప్రాంతంలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీసిటీ మేనేజర్(సేఫ్టీ) నరేంద్రబాబు తెలిపారు. మార్చి 4న ముగింపు ఉత్సవం జరుగుతుందన్నారు.

## ఆగమాలు...భారతీయ సంస్కృతికి ప్రాణాధారం



తిరుపతి విద్య,ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: వైష్ణవ ఆగమాలు భారతీయ దేవాలయాల సంస్కృతికి ప్రాణాధారమని డైరెక్టర్ డాక్టర్ కేటీవీ రాఘవన్ పేర్కొన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీ,తిరుపతి ఇందిరా గాంధీ రాష్ట్రీయ కళా కేంద్రం ప్రాంతీయ కార్యాలయం సంయుక్త ఆధ్వరంలో గురువారం శ్రీ పాంచరాత్రాగమే పావిత్రోత్స వాంతర్గత ప్రాయశ్చిత్త విధానం అనే అంశంపూ వైష్ణవ ఆగమ ఉపన్యాస శ్రేణి కార్యక్రమానికి ఏజీఎన్సీఏ కార్యలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సంప్రదాయ శాస్త్ర విజ్ఞానాన్ని శాస్త్రీయ వేదికల ద్వారా పునరుద్ధరించడం, యువతలో అవగాహన పెంపొందించడం, పండితులను ఒకే వేదికపైకి తీసుకురావడం వంటి లక్ష్యంతో ఈ ఉపన్యాస శ్రేణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఎన్ఎస్‌యులో విశిష్టాద్వైత వేదాంత విభాగాధిపతి ప్రొఫెసర్ చక్రవర్తి రాఘవన్ మాట్లాడుతూ వైష్ణవ ఆగమాల తాత్విక పునాదులని, విశిష్టాద్వైత సిద్ధాంతంతో వాటి అనుసంధానం అకడమిక్ పరిశోధనలు మరింత విస్తృతం కావాలని, ఆగమ అధ్యయనం సమకాలీన సందర్భంలో మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మావతి అమ్మవారి ఆలయం సీనియర్ అర్చకులు, టీటీడీ ఆగమ సలహాదారులు కాందూరి శ్రీనివాసాచార్యులు, పండితులు పాల్గొన్నారు.

## ఆగిన నిర్మాణం-అవస్థల ప్రయాణం!

సత్యవేడు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: ఎక్కడ పైసలు వస్తుందో..అక్కడ అన్నీ తామై కొందరు అధికారులు, అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు దూసుకు పోతున్నారు. అయితే అభివృద్ధి విషయాలపై ఏర్పడ్డ చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడానికి వారు ఏ మాత్రం ముందుకు రావడం లేదని చెప్పడానికి ఉదాహరణగా సత్యవేడు-ఊత్తుకోట రోడ్డు మార్గంలో ఆగిన పనులు పేర్కొనవచ్చు. ఆగిన పనుల వల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించడం నిత్యం ప్రమాద భరితంగా మారిందని ఇటు వాహన చోదకులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నా బార్డు నిధులు ఆగిన పనులు:**

సత్యవేడు-ఊత్తుకోట రోడ్డు మార్గం మొత్తం 15 కి.మీ. వీటి అభివృద్ధిపనుల కొరకు నా బార్డు కింద 4.05 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. నగరి ప్రాంతానికి చెందిన ఓ కాంట్రాక్టర్ల ద్వారా తగ్గించుకోవడం జరిగింది. ఆగమేగాలపై స్థానికుల అభ్యర్థన మేరకు నిర్మాణ పనులను రెండు మాసాలకు మునుపు ప్రారంభించారు. స్థానిక వీఎంకే కల్యాణ మండపం నుంచి వెంకటరాజుల కండ్రిగ వరకు రోడ్డునఉ కొంత వెడల్పు చేసి తారు వేసి పనులు అక్కడి వరకు పూర్తి చేయడం జరిగింది. వెంకటరాజుల కండ్రిగ నుంచి ఊత్తుకోట వరకు ఇంకా పనులు చేయాల్సి ఉంది. అంటే 11కి.మీ రోడ్డు అభివృద్ధి పనులు ఆగిపోయింది. అక్కడక్కడ రోడ్డు బాగా దెబ్బతినడంతో వాటిని బలోపేతం చేయడం కొరకు తవ్వేసి పనులు ఆపేశారు. అప్పటి నుంచి ఈ రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలు సాగించడం ప్రమాదకరంగా మారింది.

**నన్ను వదిలేయండి: కాంట్రాక్టర్**

ఏమైందో ఏమో...ఈ రోడ్డు బలోపేత నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కనీసం అధికారులకు సమాచారం ఇవ్వకుండానే పనులు ఆపడం జరిగింది. విషయం తెలుసుకున్న అధికారులు సంబంధిత కాంట్రాక్టుని ప్రశ్నిస్తే నన్ను వదిలేయండి నేను ఈ నిర్మాణం పనులు చేపట్టలేను అని తేల్చేయడం జరిగిందని స్థానికులు అంటున్నారు. ఈ రోడ్డు మార్గంలో ఐదు నిమిషాలకు పది టిప్పర్ లారీలు ఊత్తుకోట వైపుగా మట్టిని తీసుకుపోతున్నాయి. ఈ కారణంగా రోడ్డు బలోపేతపనులకు సమస్య వస్తుందని, నిర్మాణం జరిగిన వెంటనే ఈ భారీ టిప్పర్లు వెళ్ళడం వల్ల తరచూ నాణ్యత దెబ్బతింటుందని అందు వల్ల నాకు చెడ్డపేరు వస్తుంది. నన్ను వదిలేయండి అని కాంట్రాక్టర్ చేతులెత్తేశాడని గ్రామస్తులు చెబుతున్నారు.